వార్త
ఆదివారం
22 జనవరి, 2023



# ఆడబిడ్డలే ప్రగతికి ఆధారం

# విక్టరీ వెంకటేష్ తాజా చిత్రం!



**టాలీవుడ్** స్టార్ హీరో విక్టరీ వెంకటేష్ ఇటీవల అనిల్ రావిపూడి తీసిన 'ఎఫ్.3' సినిమాతో పెద్ద సక్సెస్ అందుకున్నారు. ప్రస్తుతం రానా దగ్గుబాటితో కలిసి రానా నాయుడు వెబ్ సిరీస్‌తో పాటు బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్‌ఖాన్‌తో కలిసి 'కిసి కా భాయ్ కిసి కా జాన్' సినిమాలో నటిస్తున్నారు. అయితే వెంకటేష్ నటించనున్న తరువాతి సినిమా గురించి విభిన్న కథనాలు వినిపిస్తున్నాయి.

లేటెస్ట్ టాలీవుడ్ బజ్ ప్రకారం ఇటీవల అడివి శేష్ హీరోగా రూపొందిన 'హిట్ 2' సినిమాతో పెద్ద విజయం అందుకున్న శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేష్ తన 75వ సినిమా చేయనున్నారని, అదేవిధంగా ఈ చిత్రాన్ని నిహారిక ఎంటర్టైన్మెంట్స్ వారు భారీ స్థాయిలో రూపొందించనుండగా, కెజిఎఫ్ సినిమాల ఫేమ్ శ్రీనిధి శెట్టి ఇందులో హీరోయిన్‌గా నటించనున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇంతవరకు దీని గురించి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## తారాతీరం

# షూటింగు పూర్తి చేసుకున్న 'దసరా'



**నేచురల్** స్టార్ నాని కథానాయకుడుగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'దసరా'. కీర్తిసురేష్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాని శ్రీలక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి భారీ వ్యయంతో నిర్మిస్తుండగా సంతోష్‌నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటోంది. సింగరేణి బొగ్గుగనుల నేపథ్యంలో సాగే మాస్ యాక్షన్ డ్రామాగా పాన్ ఇండియా రేంజ్‌లో మార్చిలో విడుదల కానుంది. కీలక పాత్రల్లో సముద్రఖని, దీక్షిత్‌శెట్టి, మీరాజాస్మిన్, రాజేంద్రప్రసాద్ నటిస్తున్నారు. సత్యన్ సూర్యన్ ఈ చిత్రానికి ఫొటోగ్రఫీ అందిస్తున్నారు.

ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
22 జనవరి, 2023

## మంచి ముత్యాలు

అందమైనదేనినీ పోటీ ద్వారా నిర్మించలేనట్లే,
గర్వంతో ఉన్నతమైన పనులేవీ చేయలేము.

\- జాన్ రస్కిన్

## విషయ విశేషం

విడాకులొద్దు కలిసే జీవిస్తాం... 4

'సంఘీ'భావం....5

భారత్ అద్భుత శక్తి వందేభారత్

ప్రజాస్వామ్య విజయానికి పునాది ఓటువాక్కు...6

కవర్ స్టోరీ..8

ఆడబిడ్డలే
ప్రగతికి ఆధారం

విలాసవంతమైన జీవనం...18

కథ.. 20

అమృతం

ఈవారం కవిత్వం..24

అద్భుత మహోత్సవ వేళ

గోమటేశ్వరుడు కొలువున్న శ్రావణబెళగోళ..25

సాహిత్యం.. 30

తెలుగు సాహిత్య చరిత్రలో కవయిత్రులు

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

సరదాగా కాసేపు..

వగైరా..వగైరా..




# తాజా వార్తలు

## థియేటర్‌లో 'క్రైయింగ్ రూమ్'

థియేటర్‌లో సినిమా చూసిన అనుభూతి మాటల్లో చెప్పలేం. కానీ ఇంట్లో పసిపిల్లలు ఉన్నప్పుడు అలా వెళ్లి చూడటం కుదరదు. అలాగని పిల్లల్ని వదిలేసి వెళ్లలేం. ఒకవేళ ధైర్యం చేసి థియేటర్‌కి తీసుకెళ్లినా ఆ శబ్దాలకి పిల్లలు ఏడవడం, నిద్రపోకుండా చిరాకు పడటం వంటివి చేస్తుంటారు. దాంతో మిగతా ప్రేక్షకులకీ ఇబ్బంది కలుగుతుంది. అప్పుడు సినిమా మధ్యలోనే ఇంటికెళ్లిపోవడం తప్ప తల్లిదండ్రులకు మరో ఆప్షన్ ఉండదిక. ఇలాంటి ఇబ్బందులను తొలగించడానికి కేరళ ప్రభుత్వం ఓ వినూత్న ఆలోచన చేసింది. కేరళ రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ (కేఎస్‌ఎఫ్‌డీసీ) నిర్వహించే కైరాళి శ్రీనీల థియేటర్‌లో పసిపిల్లల కోసం 'క్రైయింగ్ రూమ్' పేరిట ఓ ప్రత్యేక గదిని ఏర్పాటు చేసింది. పసివాళ్లు ఏడుపు మొదలు పెట్టగానే వాళ్లను పారదర్శకంగా అద్దాలతో నిర్మించిన ఆ గదిలోకి తీసుకెళ్లిపోవచ్చు. అది సౌండ్ ప్రూఫ్ గది అయినందువల్ల ఆ గదిలోంచి పిల్లల ఏడుపులు బయటి వారికి వినిపించవు. బయటి శబ్దాలు చాలా నిదానంగా లోపలికి వినిపిస్తాయి. పిల్లల్ని సముదాయించుకుంటూనే సినిమా చూసే వెసులుబాటున్న ఆ గదిలో తల్లిపాలు ఇవ్వడంతో పాటు డైపర్లు మార్చుకునే సౌకర్యం ఉంటుంది. పిల్లల ఏడుపుతో ప్రేక్షకులకు అసౌకర్యం కలగదు. .

### ఊరి కోసం..

ఆరేళ్ల వయసులో అమ్మా నాన్నలను పోగొట్టుకుని అనాథ అయ్యాడు అతడు. ఊరివాళ్ల సహకారంతో చదువుకున్నాడు, టీచర్ ఉద్యోగం సంపాదించాడు. మరి.. తనను తల్లిలా ఆదరించిన పల్లె రుణం ఎలా తీర్చుకోవాలి? యూపీలోని కన్నౌజ్‌కు చెందిన రామ్‌శరణ్ శాక్య తన ఊరి రుణం ఎలా తీర్చుకోవాలా? ఆలోచించాడు. తనకు వారసత్వంగా వచ్చిన ఎకరం భూమిని స్వగ్రామం నాగ్లా అంగద్ బాగుకోసం ఆనందంగా రాసిచ్చేశాడు. ఆ ఊళ్లో బడి లేకపోవడంతో అక్కడి విద్యార్థులు బయటి గ్రామాలకు వెళ్లి చదువుకోవాల్సి వచ్చింది. దాంతో చాలామంది మధ్యలోనే చదువులకు దూరమయ్యేవాళ్లు. కొన్నాళ్ల క్రితం ఆ ఊరికి ఒక ప్రాథమిక పాఠశాల మంజూరైంది. అందుకోసమని విద్యాశాఖాధికారులు స్థలం కోసం వెతుకుతుంటే రామ్‌శరణ్ లక్షలు ఖరీదు చేసే తన భూమిని పెద్ద మనసుతో వాళ్లకు అప్పగించాడు. అతడి ఆధ్వర్యంలోనే 117 మందితో ప్రారంభమైన ఆ బడిలో ఇప్పుడు మూడొందల మందికి పైగా చదువుకుంటున్నారు.





# విడాకులొద్దు కలిసే జీవిస్తాం

రొమేనియాలో బీర్టాన్ అనే ఓ చిన్న గ్రామం ఉంది. ఆ గ్రామంలో ఒక చర్చి, ఆ చర్చికి దగ్గర్లో 'మారిటల్ ప్రిజన్' పేరుతో పిలిచే ఒక చిన్న ఇల్లుంది. మనస్పర్థలతో, తరచూ గొడవలతో విడాకులు తీసుకోవాలను కుంటున్న దంపతులు "మాకు విడాకులు ఇప్పించండి" అని ఇక్కడి బిషప్‌ను కలుస్తుంటారు. విడాకులు కావాలని అక్కడికి వచ్చిన దంపతులను ఆయన చర్చి ఆవరణలో ఉన్న ఇంట్లో వారిని వదిలి బయట నుండి గడియ పెట్టేస్తారు. రెండు నుంచి ఆరు వారాల పాటు దంపతులను బయటకు రానీయకుండా అందులోనే ఉంచుతారు. అందులో నుంచి వచ్చిన తరువాత వారు ఆశ్చర్యంగా "మాకు విడాకులు వద్దని, మేం కలిసిపోయామని, మా మధ్య ఎలాంటి మనస్పర్థలు లేవని" చెబుతారు. గత మూడు వందల ఏళ్లలో ఎన్నో జంటలు ఈ ఇంట్లోకి వెళ్లగా, ఒకే ఒక జంటకు విడాకులు లభించాయంటే 'మారిటల్ ప్రిజన్' గొప్పదనం అర్థం చేసుకోవచ్చు.

అన్నీ పంచుకోవాల్సిందే..

చర్చికి దూరంగా కొండపైన ఉంటుంది 'మారిటల్ ప్రిజన్'. ఇండిపెండెంట్ ఇల్లే అయినా ఒకే గది ఉంటుంది. అందులో ఒక కుర్చీ, ఒక టేబుల్, ఒక బెడ్ ఉంటాయి. ఒకే దిండు, ఒకే దుప్పటి ఉంటాయి. ప్లేట్, స్పూన్ కూడా ఒక్కటే ఉంటుంది. అందులోకి వెళ్లినవారు అన్నింటినీ షేర్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆహారం తయారు చేసుకోవడానికి కష్టమవుతుంది. అందుకే ఆ ఇంట్లోకి వెళ్లిన దంపతులు ఈ జైలులో (గది అయినప్పటికీ) ఉండేకన్నా బయటకు వెళ్లి కలసి ఉందామని నిర్ణయించుకుంటారట.





"సాధారణంగా భార్యాభర్తలు గొడవ పడటానికి, విడిపోవాలనుకోవటానికి ప్రధాన కారణం వారి మధ్య ప్రేమ లేకపోవడమే. జీవించాలనే భయం ఉంటే క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకున్న ఇద్దరు వ్యక్తులు కలిసిపోతారు. అలాంటి పరిస్థితి ఇక్కడ ఏర్పడుతుంది కాబట్టి సాధారణంగానే విడాకులు వద్దనుకుంటారు" అని అక్కడి బిషప్‌లు చెబుతారు. అందుకే స్థానికులు దీన్ని 'మారిటల్ ప్రిజన్' అని పిలుస్తారు. కొందరు రెండు వారాల్లో కలిసిపోతే; మరికొందరికి ఆరు వారాల సమయం పడుతుందంటున్నారు అక్కడి బిషప్. పెళ్లి కష్టాల నుంచి బయట పడేయమని ఇప్పటికే కొన్ని జంటలు చర్చికి వస్తుంటాయట. అలాంటి వారంతా ఈ జైలు జీవితాన్ని చవిచూశాక తమ నిర్ణయాన్ని మార్చుకోకుండా ఉండలేరు. అయితే ప్రస్తుతం ఈ జైలు మ్యూజియంగా మారింది.



'సంఘీ' భావం



# భారత్ అద్భుతశక్తి వందేభారత్

**మన**దేశంలోని నిపుణులు ఎందులోనూ తక్కువ కాదని పలు మార్లు ఇప్పటికే నిరూపించుకున్నారు. ఎన్నో ఆవిష్కరణల్లో సాటి లేరని ప్రపంచానికి సవాల్ విసిరారు. ప్రస్తుతం ప్రపంచ విపణిని శాసిస్తున్న అనేక ఈ కామర్స్, వాణిజ్య సంస్థలకు భారతదేశానికి చెందిన వారే సిఇవోలుగా రాణిస్తున్నారు. మొన్నటికి మొన్న కరోనా ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న తరుణంలో మన శాస్త్రజ్ఞులు రూపొందించిన టీకాలు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలకు సరఫరా చేశారు. కరోనా నిర్మూలనకు ఈ టీకాలు అద్భుతంగా పనిచేస్తున్నా యని ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం అభినందించింది. మన దేశం లో 90 శాతం మంది రెండు డోసులూ ఉచితంగా ఇచ్చి అనేక మంది ప్రాణాలను మన శాస్త్రజ్ఞులు కాపాడగలిగారు. మనదేశంలో మట్టిలో మాణిక్యాలవంటి నిష్ణాతులు ఉన్నారు.సరైన ప్రోత్సాహం, సహకారం, మనవాళ్లపై నమ్మకం లేక అనేక ఆవిష్కరణలు వెలుగు చూడటం లేదు. అయితే అనుకోని విధంగా వందేభారత్ రైళ్ల తయారీలో మన ఇంజనీర్లకు అవకాశం కల్పించారు. ప్రతిష్టగా తీసుకున్న మన ఇంజనీర్లు తమ పనితనానికి మరోసారి సానబెట్టి ఇండియా పవర్‌ను మరోసారి ప్రపంచానికి చాటి చెప్పారు. ముందుగా భారతదేశంలో హైస్పీడ్ రైలును రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి గ్లోబల్ టెండర్లను ఆహ్వానించగా కొన్ని దేశాలు మన రైల్వేట్రాక్‌లు హైస్పీడ్‌ను తట్టు కోలేవని తప్పుకున్నారు. ఒక విదేశీ సంస్థ ముందుకు వచ్చింది కాని పది బోగీల తయారీకి ఇండియన్ కరెన్సీలో 250 కోట్లు ఖర్చు అవుతుందని స్పష్టం చేశారు. మన దేశంలో కనీసం నాలుగు వందల హైస్పీడ్ రైళ్లను ప్రవేశపెట్టే లక్ష్యంతో ఉన్న ప్రభుత్వానికి అంతపెద్ద మొత్తం డబ్బు చెల్లించే పరిస్థితి లేకుండా పోయింది. ఈ తరుణంలో ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ నిర్వాహకుడు సుధాన్షుమణి అనే ఇంజనీర్ ప్రభుత్వంతో చర్చలు జరిపారు. అవకాశం ఇస్తే ఇండియాలోనే హైస్పీడ్ రైలును రూపొందిస్తానని హామీ ఇచ్చారు. అనేక తర్జనభర్జనల తరువాత సుధాన్షు ఇచ్చిన నివేదికలను పలు మార్లు పరిశీలించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆయన కోరిన ప్రకారం సుమారు వంద కోట్ల రూపాయల బడ్జెట్‌ను రూపొందించి ఆయన కు అందించారు. ఈ రైలుకు సంబంధించిన కొన్నింటిని మాత్రం స్పెయిన్, ఉక్రెయిన్‌ల నుంచి దిగుమతి చేసుకున్నారు. ముందుగా ఉక్రెయిన్ నుంచి 36 వేల చక్రాలను భారత్ ఆర్డర్ చేసింది. అయితే అక్కడ యుద్ధం కారణంగా సరఫరాలకు అంతరాయం ఏర్పడింది. దీనితో చెక్ రిపబ్లిక్, పోలండ్, మలేషియా, చైనా నుంచి వివిధ కంపెనీల ద్వారా అంతరాయం లేకుండా చక్రాలను దిగుమతి చేసుకున్నారు. అయితే ప్రస్తుతం దుర్గాపూర్ రైల్వే స్టీలొసిటీ ప్లాంట్‌లో లక్ష చక్రాలను ఉత్పత్తిచేయడానికి స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ముందుకు వచ్చింది. ఏటా హైస్పీడ్ రైళ్లను పట్టా లెక్కించేందుకు వీలుగా 80 వేల చక్రాలను భారత్‌లోనే నిర్మించే ప్రక్రియకు రూపకల్పన చేసింది. మొదటి రైలును ట్రైన్ 18 అని నామకరణం చేశారు. 2019 జనవరి 26న ఈ రైలుకు వందే భారత్‌గా పేరు మార్చారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ లోపలి భాగం అధిక వేగంతో గాలి నిరోధకతను తగ్గించడానికి ఏరోడైనమిక్ డిజైన్‌ను రూపకల్పన చేశారు. రైలు సెట్ బరువు గరిష్టంగా 430 టన్నులు ఉంది. 16 కంపార్ట్‌మెంట్‌లలో 1128 మంది ప్రయాణిం చే విధంగా తయారు చేశారు. ఎగ్జిక్యూటివ్ కోచ్‌లలో 52 మంది, మిగిలిన వాటిలో 78 మంది కూర్చొని ప్రయాణించే సౌకర్యం ఉంటుంది. బయోవా క్యామ్ మరుగుదొడ్లతో పాటు జిపిఎస్ ఆధారిత ప్రయాణీకుల సమాచార వ్యవస్థను కల్పించారు. పైగా మొట్టమొదటిసారిగా పునరుత్పత్తి బ్రేకింగ్ విధానాన్ని దీనిలో ప్రవేశపెట్టారు. ముఖ్యంగా ఈ రైళ్లలో వేగంతో పాటు ప్రయాణీకుల భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించారు. ప్రస్తుతం రన్నింగ్‌లో ఉన్న వందేభారత్ రైళ్లన్నీ కేవలం సీటింగ్ సదుపాయం ఉన్నవే. తెలుగు రాష్ట్రాలను కలిపే విధంగా సికింద్రాబాద్ నుంచి విశాఖప ట్నానికి జనవరి 15న ప్రారంభించిన రైలులో కూడా సీటింగ్ సౌకర్యం మాత్రమే ఉంది. దీనివల్ల ఈ రైలును పగటి పూట మాత్రమే నడపాల్సి వస్తోంది. త్వరలోనే స్లీపర్ కోచ్‌లతో రైళ్ల తయారీ ప్రయోగం జరుగుతోంది. ఇందులో మూడు తరగతులు ఉంటాయి. ప్రస్తుత రైలు 180 కిలోమీటర్ల గరిష్ట వేగం ఉంటే రాబోయే రైళ్ల 200 కిలోమీటర్ల సామర్థ్యానికి పెంచుతున్నారు. ఒకసారి తయారైన రైలు 35 ఏళ్ల పాటు సర్వీసును అందిస్తుంది. ప్రస్తుతం మన దేశంలో ఎక్కువ ప్రాంతాల్లో ట్రాక్‌లు 110 నుంచి 130 కిలోమీటర్ల వేగ సామర్థ్యం మాత్రమే కలిగి ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో సింగిల్ ట్రాక్ మాత్రమే ఉంది. దీనితో వందేభారత్ రైళ్ల తయారీతో పాటు కనీసం 200కిలోమీటర్ల వేగ సామర్థ్యాన్ని తట్టు కునే విధంగా ట్రాక్‌లను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కేంద్ర రైల్వే మంత్రి పేర్కొన్న వివరాల ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న సికింద్రాబాద్ - విశాఖ రైలు కాకుండా మరో నాలుగు ప్రవేశపెట్టే యోచనలో ఉన్నారు. సికింద్రా బాద్ నుంచి విజయవాడకు, తిరుపతికి, చెన్నయ్‌తో పాటు వివిధ మార్గాల్లో వీటిని ప్రవేశపెడతారు. స్పీడ్, సౌకర్యం కోరుకునే ఎగువ మధ్యతరగతి కుటుంబాలు, వ్యాపారవేత్తలకు ఇవి ఎంతో సౌకర్యం గా ఉంటాయి. ఈ రైళ్లు పెరిగితే ఈ స్థాయి ప్రయాణీకులు హైస్పీ డ్‌కే ప్రాధాన్యత ఇస్తారు. దీనితో ప్రస్తుతం నడుస్తున్న సాధారణ రైళ్లకు ప్రయాణీకుల వత్తిడి గణనీయంగా తగ్గుతుంది. ప్రయాణీకు లకు ఎంతో సౌకర్యంగా ఉండటమే కాకుండా దూరాలను దగ్గర చేస్తూ విజయవంతంగా సాగుతున్నాయి. భారతీయ ఇంజనీర్ల నైపుణ్యంతో దాదాపుగా బుల్లెట్ రైలుకు సమానంగా వందేభారత్ రైళ్లను తీర్చిదిద్దగలగడం మన గర్వకారణం.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# ప్రజాస్వామ్య విజయానికి పునాది

# ఓటుహక్కు

కందుకూరి భాస్కర్

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఎన్నికలను సక్రమంగా నిర్వహించడానికి రాజ్యాంగం ప్రకారం 1950 జనవరి 25న ఎన్నికల సంఘం ఏర్పడింది. ఎన్నికల కమిషన్ ఏర్పడి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కమిషన్ సేవలు స్ఫురణకు వచ్చేలా భారత ప్రభుత్వం మొదటిసారిగా 2011 జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రకటించింది. అప్పటినుండి ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా ఎన్నికల కమిషన్ ఓటుహక్కుపై, ప్రజాస్వామ్య వ్యవస్థపై విద్యార్థులకు, ప్రజలకు ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

స్వాతంత్ర్యానంతరం దేశంలో అప్పుడు ఉన్న పరిస్థితులకు అనుగుణంగా జాతీయ నాయకులు మన దేశ పరిపాలన కోసం ప్రజాస్వామ్యయుత ప్రభుత్వ విధానాన్ని ఎంపిక చేశారు. మొదట్లో కొందరికే పరిమితమైన ఓటుహక్కు రాజ్యాంగం ప్రకారం అందరి చేతిలో ఆయుధమైంది. ఆధునిక కాలంలో ప్రజాస్వామ్య విజయానికి నాంది పలికింది. సామాన్యుల గొంతుకు బలం చేకూర్చింది. ప్రజాస్వామ్యంలో నియంతృత్వానికి తావు లేదు. ప్రజలకు సర్వసత్తాధికారం ఉంటుంది. అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్ అభిప్రాయం ప్రకారం "ప్రజల చేత, ప్రజల కొరకు న్విహింపబడే ప్రజల ప్రభుత్వమే" ప్రజాస్వామ్యం.

ప్రజలకు జవాబుదారీ కలిగివుండి పరిపాలనను నిర్వహించడానికి ప్రజలే తమ ప్రతినిధులను ఎంపిక చేసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థ ముఖ్య లక్షణం. అటువంటి గొప్పనైన ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు పునాది ఓటు. భారత రాజ్యాంగంలోని 326 అధికరణం ప్రకారం భారతీయ పౌరుడై ఉండి, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటుహక్కు కల్పించబడింది. కుల, మత, లింగ, ప్రాంత, భాష, జాతివివక్ష లేకుండా పేద, ధనిక భేదం లేకుండా అక్షరాస్యులైనా, నిరక్షరాస్యులైనా పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి ఈ సార్వత్రిక వయోజన ఓటుహక్కు ఉంటుంది. రాజ్యాంగంలో పొందుపరిచిన సార్వత్రిక వయోజన ఓటుహక్కు ప్రపంచ రాజకీయ చరిత్రలోనే ఒక విప్లవాత్మకమైన మార్పుగా చెప్పవచ్చు. అభివృద్ధి చెందిన దేశాల కంటే చాలా ముందుగానే మన దేశంలో వయోజన ఓటుహక్కును భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించి ప్రజాస్వామ్య వ్యవస్థకు నాంది పలికింది.

ఎన్నికలలో పోటీ చేయడానికైనా ఓటు వేయడానికైనా ఓటరుగా నమోదు కావడం తప్పనిసరి. ఎన్నికల కమిషన్ ఒక స్వతంత్ర వ్యవస్థగా పని చేస్తూ ఓటర్ల జాబితా రూపకల్పన చేసి ఎన్నికలు సజావుగా జరిగేలా చూస్తుంది. ఓటరుగా నమోదు చేసుకోవడం అనేది నిరంతరం కొనసాగే ప్రక్రియ. ఇప్పుడు ఓటరుగా పేరు నమోదు చేసుకోవడం కూడా చాలా సులభం. ఫారం 6 పూరించి ఆన్ లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. లేదా గ్రామస్థాయిలో బూత్ లెవల్ అధికారికిగానీ మండల స్థాయిలో తహాశీల్దార్ కార్యాలయంలోగానీ సంప్రదించి ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.

దేశంలో చాలా మంది ఓటర్లు తమ ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకోవడం లేదు. 1952లో జరిగిన మొదటి సాధారణ ఎన్నికల్లో 45 శాతం మాత్రమే ఓటింగ్ నమోదయింది. 2019లో 17వ లోక్‌సభకు జరిగిన సాధారణ ఎన్నికల్లో 67 శాతం మంది ఓటు వేశారు. మొత్తం ఓటర్లలో 90 శాతం ఓటింగ్ జరిగినట్లయితే ఆ దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అన్నారు. యువతే దేశ భవిష్యత్తుకు ఆయువు పట్టు. దేశ రాజకీయాల్లో యువత పాత్ర అత్యంత కీలకమైంది.



కానీ ఆ యువతే రాజకీయాలకు దూరంగా ఉంటుంది. కనీసం ఓటు వేయడానికి కూడా వారు ముందుకు రావడంలేదు. చాలా మంది పెద్దలు మాత్రం ఓటు వేయకుంటే చనిపోయినట్టేనని భావిస్తారు. సాధారణ ఎన్నికల్లో యువత ఓటింగ్‌శాతం చాలా తక్కువగా ఉంటుంది. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో కంటే పట్టణ ప్రాంతాల్లో తక్కువగా ఓటింగ్ నమోదు అవుతున్నది. చదువుకున్న వారికంటే చదువుకోనివారే ఓటు హక్కుపై శ్రద్ధ చూపించి తమ ఓటును వినియోగించుకుంటున్నారు.




ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధం. ప్రతి ఓటరు నిర్భయంగా, నిష్పక్షపాతంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలి. కుల, మతాల ఆధారంగా కాకుండా అభ్యర్థి గుణగణాలను చూసి ఓటు వేయాలి. ఓటును డబ్బుకోసం, మద్యంకోసం, బహుమతుల కోసం దుర్వినియోగం చేయడం ప్రజాస్వామ్యంలో అత్యంత ప్రమాదకరమైన విషయం. నేటి సమాజంలో ఎవరు డబ్బు, మద్యం ఇచ్చినా తీసుకుందాం.. ఎవరికో ఒకరికి ఓటు వేద్దాం! అనే చెడు భావన ప్రజలలో విపరీతంగా నాటుకుపోతున్నది. కానీ ఓటును అమ్ముకోవడం ద్వారా ప్రజాప్రతి నిధులను ప్రశ్నించలేం. సమస్యలపై వారిని నిలదీయలేమనే విషయాన్ని ఓటర్లు గ్రహించాలి. దేశ భవిష్యత్తు నాయకుల చేతుల్లో ఉంటుంది. ఆ నాయకుల తలరాతను మార్చేది ఓటు. కాళోజీ అన్నట్టు "అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు, ఏపాటివాడో చూడాలి". ప్రజలకు ఇప్పటివరకు ఏం చేశాడో గమనించి, స్వార్థరహితంగా ప్రజలకు సేవ చేయాలనే తపన ఉన్న మంచి నాయకుడిని ప్రజలు ఎన్నుకోవాలి. అవినీతి, నేరమయ రాజకీయ జీవితం కలిగిన నాయకులకు ఓటుతో తగిన గుణపాఠం చెప్పవచ్చు. ఎన్నికల్లో నిలబడిన నాయకులు నచ్చనట్లయితే 'నోటా'కు ఓటు వేసే అవకాశాన్ని కూడా ఎలక్షన్ కమిషన్ కల్పించింది.



ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే ప్రతిఒక్క ఓటరు విధిగా తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలి.

ఐదేళ్లకొకసారి తమ ప్రతినిధులను ఎంపిక చేసుకొని ఓటు హక్కు వినియోగించుకున్నంత మాత్రాన పౌరుని బాధ్యత తీరిపోదు. ప్రజలు తమ ప్రతినిధుల కార్యకలాపాలను నిరంతరం సమీక్షిస్తూ ఉండాలి. ప్రజా ప్రతినిధులు తప్పు చేసినపుడు వారిని ప్రశ్నించడానికి కూడా వివిధ మార్గాలు ఉన్నాయి. అధికారులకు, ప్రజాప్రతినిధులకు నివేదికలు ఇవ్వడం, ఊరేగింపులు, సమావేశాలు నిర్వహించడం, నిరసన దీక్షలు చేపట్టడం ద్వారా పత్రికలు, ఎలాక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించవచ్చు. ఎన్నికలయ్యాక ప్రజా ప్రతినిధులు, పాలకవర్గం సరిగా పనిచేయలేదని భావించినపుడు మార్పుకోసం ప్రజలకు ఓటే వజ్రాయుధం. ప్రజాస్వామ్యం విజయవంతంగా కొనసాగాలంటే జాగరూకులైన ప్రజావళి అవసరం ఎంతైనా ఉంది.

ఓటు పౌరుడి అస్తిత్వానికి ప్రతీక. ఒక దేశ స్థితిగతులను మార్చే శక్తి ఓటుకు ఉంది. ఒక వ్యవస్థ నిర్మించడానికైనా, కూలదోయ డానికైనా సామాన్య ప్రజానీకానికి ఉన్న ఏకైక ఆయుధం ఓటు. సమాజం బాగుపడాలన్నా, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నా ఓటర్లందరూ విధిగా ఓటుహక్కును వినియోగించుకోవాలి. అందుకే రాజ్యాంగ పిత డా॥ బి.ఆర్. అంబేద్కర్ "భారతదేశంలో చారిత్రాత్మకంగా వెనుకబడిన వర్గాలు రాజకీయంగా అభివృద్ధి చెందడానికి, పౌరసత్వం పొందడానికి ఓటుహక్కు అతి ముఖ్యమైన మార్గమని" అభిప్రాయపడ్డారు. కాబట్టి ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉంది. ❑





# ఆడబిడ్డలే ప్రగతికి ఆధారం



మనదేశంలో ఆడపిల్ల అంటే మహాలక్ష్మి అని భావించేవారు, కళ్లల్లో పెట్టుకుని చూసుకునే వారు ఇప్పటికీ ఉన్నారు. అలాగే కొందరు ఆడపిల్ల పుడితే భారంగా భావిస్తూ ఆడపిల్ల అనగానే చీదరించుకుంటూ, పుట్టీ పుట్టగానే, కళ్లు కూడా తెరవనీయకుండానే ఈ లోకానికి దూరం చేస్తున్న వారు ఉన్నారు. పుట్టిన నిమిషాల్లోనే ఆడబిడ్డలను డబ్బుకు అమ్మేసే క్రూరులు, చెట్ల పొదల్లో, మురికికాల్వల్లో పడేసి చేయి దులుపుకునే దుర్మార్గులు ఎందరో కనబడుతున్నారు. ఆడపిల్ల పుట్టిందని భార్యలను పుట్టింట్లోనే వదిలేసిన భర్తలూ ఉన్నారు. పుట్టిన క్షణం నుంచే ఆడబిడ్డలకు ఆంక్షలు విధించే ప్రబుద్ధులు, ఆ అంతరాన్ని దాటి కళ్లు తెరిచి భూమ్మీదకి వచ్చినా ఆ అమ్మాయిని వివక్షకు గురి చేసే దుర్మార్గులు అడుగడుగునా కనబడుతున్నారు. అవును ఎన్ని చట్టాలున్నా నేడు ఆడపిల్లల మీద అఘాయిత్యాలు, ఎన్నో అనుమానాలు, మరెన్నో అవమానాలు, ఇంకెన్నో చీత్కారాలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. నిజం చెప్పాలంటే నేటి సమాజంలో ఆడపిల్ల పెరిగి పెద్దదవ్వాలంటే అడుగడుగునా అంతులేని సవాళ్లు ఎదురవుతూనే ఉన్నాయి.

**కవర్ స్టోరీ**

**కాళంరాజు వేణుగోపాల్**

ఆ అడ్డంకుల్ని అధిగమిం చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ క్రమంలో ఆమె జీవితం ఎన్నో సవాళ్లతో కూడుకుని ఉంటుంది. ఆ సవాళ్లను చేదిస్తూ తన జీవితాన్ని తానూ నిలబెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే నేటి బాలికలే రేపటి మాతృమూర్తులు. ఆ క్రమంలో బాలికల భవిష్యత్తును గూర్చి చర్చించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే జనవరి 24న జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా ఈ ప్రత్యేక కథనం.

**తగ్గుతున్న ఆడవారి జనాభా**

గత కొద్దికాలం నుండి మన సమాజంలో ఎన్ని చట్టాలు వచ్చినా ఆడపిల్లలను కనడం దగ్గర నుంచి, పెంచి పెద్ద చేయడం, చదివించడం, పెళ్లి, ఉద్యోగం, కుటుంబం ఇలా ప్రతిచోటా తల్లిదండ్రులు అవమానాలకు గురికావాల్సి వస్తుందన్న భావనతో ఆడపిల్లలను కనడానికి జంకుతున్న వారున్నారు.

ఏది ఏమైనా ఈ సమాజ మనుగడ కోసం ప్రతి పురుషుడు తనకొక భార్య కావాలని కోరుకుంటున్నాడు కానీ లోకానికి తనొక కూతుర్ని కనాలని అనుకోవడం లేదు. ఫలితంగా నేడు ఆడపిల్లల సంఖ్య తగ్గిపోయి, ఆడపిల్లలు కరువౌతున్నారు. ఒక బాలికగా పుట్టే హక్కును కూడా లేకుండా చేస్తున్నారు కొందరు దుర్మార్గులు. పుట్టకముందే వారిని దారుణంగా చంపేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా ఇప్పటికీ 36శాతం బాల్యవివాహాలు జరుగుతున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

సమాజంలో బాలికల సంరక్షణ పట్ల అవగాహన కల్పించడానికి, బాలికల హక్కులు, ఆరోగ్యం, విద్యా, సామాజికం గా ఎదుగుదల అంశాలపై అవగాహన కల్పించడానికి ప్రతి ఏడాది జనవరి 24న జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహిస్తు న్నారు. తాజా జనగణన లెక్కల్లోనూ స్త్రీ, పురుష నిష్పత్తిలో ఆందోళనకరమైన తేడా కనిపిస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం..ప్రతీ వెయ్యిమంది పురుషులకు 940 మంది మాత్రమే మహిళలున్నట్లు తేలింది. అలాగే 6 సంవత్సరాలలోపు ఆడపిల్లలైతే ప్రతి 1000 మంది మగపిల్లలకు 914 మంది మాత్రమే ఉన్నట్లు జనాభా లెక్కల్లో వెలుగు చూసింది. ఇప్పుడు ఇంకా తగ్గి ఉంటుంది. అక్షరాస్యత శాతాన్ని చూస్తే మహిళల అక్షరాస్యత శాతం 68,4 శాతంగా ఉంది. బాల్య వివాహాలు భారత్‌లో అధికంగా అవుతున్నాయి. అత్యధికంగా 26.8 శాతం మంది బాలికలకు బలవంతం గా వివాహాలు చేస్తున్నారు. అత్యధికంగా పశ్చిమబెంగాల్‌లో 40శాతం బాల్యవివాహాలు అవుతు న్నాయని ఒక సర్వే సమాచారం. ఇది ఖచ్చితంగా ఆందోళన కలిగించే విషయమే.

## చదివే అవకాశాలు తక్కువే

ఆడపిల్లలకు అందించే విద్యావకాశాలు కూడా దయనీయంగా ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ భారతంలో ఆడపిల్లల చదువులు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. మగపిల్లలతో వారిని పాఠశాలల్లో చేర్పించినా, కుటుంబ ఆర్థిక అవసరాల కోసమో, ఇతర బాధ్యతలు నెరవేర్చడం కోసమో ఆడపిల్లలను చదువుకు దూరం చేస్తున్నారు. ఉన్నత విద్యావకాశాలు అందుకుంటున్న మహిళలు కూడా నూటికి 10 నుంచి 30శాతం మాత్రమే ఉండడం ఇందుకు సాక్ష్యం. నేటికీ ఆడపిల్లలు ఎదుర్కొంటున్న ప్రధాన ఆరోగ్య సమస్య పోషకాహార లోపం. కుటుంబ ఆర్థిక సమస్యలతో ఏదో ఒక పనిచేసి కడుపునింపుకోవాల్సిన దుస్థితి వస్తోంది. ఉన్న ఊర్లో పనులు దొరకక వలసలుపోతున్న ఆడపిల్లలు, అక్కడా రక్షణ లేక లైంగిక దాడుల బారిన పడుతున్నారు. కనిపించకుండా పోతున్న వారి సంఖ్య వందల సంఖ్యల్లో ఉంది. సామాజిక, ఆర్థిక పరిస్థితిల్లో వచ్చిన మార్పుల ఫలితంగా బాలికలంటే కేవలం కట్నం తెచ్చే యంత్రంగానే పరిగణిస్తున్నారు. దాంతో ఆడపిల్లల పెళ్లిళ్ల భారంగా మారాయి. దీంతో పేద తల్లిదండ్రులు తప్పని పరిస్థితుల్లో మైనార్టీ తీరకుండానే ఆడపిల్లలకు పెళ్లిళ్ల చేస్తున్నారు. దాంతో వారు అతి చిన్నవయస్సులోనే తల్లులుగా మారుతున్నారు. ఫలితంగా భవిష్యత్తులో అనేకరకాల ఆరోగ్యసమస్యల బారిన పడుతున్నారు.

బాలకల తగ్గుముఖం కారణాలు

బాలికల సంఖ్య అతివేగంగా తగ్గడానికి గల కారణాలు ఏమిటనే ప్రశ్నకు అనేక కారణాలు చూపుతున్నా అవన్నీ లింగ వివక్ష పెరగడానికి సాధనంగా ఉపయోగపడుతున్నాయి. 1994లో కేంద్ర ప్రభుత్వం లింగ నిర్ధారణ పరీక్షలను నిషేధించి, దీన్ని దేశవ్యాప్తంగా పటిష్ఠంగా



అమలుపరచడానికి చట్టాన్ని తెచ్చింది. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారిని శిక్షలను అమలు పరచడంలో ప్రభుత్వాలు తగిన చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదు. చట్టం వచ్చి 28 సంవత్సరాలు పైగా అయినప్పటికీ ఇది సమగ్రంగా అమలు కావడం లేదంటే మనపాలకుల చిత్తశుద్ధిని మనం అంచనా వేయవచ్చు. కొంతమంది చదువులేనివారు, మరికొంత మంది చదువుకున్న అమ్మాయిలు ఆడవారిని కనడం ఇబ్బందిగా ఫీల్ అవుతున్నారు. డబ్బులకు ఆశపడి కొందరు డాక్టర్లు, కొన్ని క్లినిక్కులు, ఆస్ప త్రులు లింగ నిర్ధారణ పరీక్షలు జరిపి అమ్మాయి అయితే కర్కశంగా నులిపేస్తు న్నారు. ఆడపిల్ల అనగానే బలవంతంగా కడుపుతీయించే దుర్భర పరిస్థితులు మనదేశంలో ఇంకా చాలాచోట్ల ఉన్నాయి. ఈ క్రమంలో కొన్నిసార్లు తల్లి ప్రాణాలు కూడా గాల్లో కలిసిపోతున్నాయి. అయినా పెద్దగా మార్పు రావడం లేదు.

## సాధికారత రావాలంటే!

బాలకల సాధికారత జరగాలంటే మనం మాట్లాడుకున్న సమస్యలలో బాలికల సమస్యలు, పరిస్థితిని చర్చించాలి. వాటికి పరిష్కారాన్ని అన్వేషించాలి. చదువు, పెంపకం, వివాహం అన్నింటి లో బాలికల పట్ల జరిగే వివక్షను నిర్మూలించాలి. ప్రకృతి సహజసిద్ధ సూత్రానికి విరుద్ధమైన రీతిలో బాలుర, బాలికల నిష్పత్తిలో తేడా అనేది అనేక విపరీత పరిణామాలకు దారితీయక తప్పదు. పెళ్లీడు ఆడపిల్లలు దొరకక మగపిల్లలకి సరైన సమయంలో పెళ్లి కాక సమాజ వ్యతిరేకులుగా తయారు అవుతున్నారు. కొంతమంది అఘాయి త్యాలు చేయడం లాంటివి చూస్తు న్నాం. మరి కొందరు అవగాహన లోపంతో తక్కువ వయసులో పెళ్లి చేయడం, వెంటనే గర్భవతి కావడం వలన వారి శరీరం, పుట్టబోయే శిశువు శరీరం అంతగా అనుకూలించక కొన్ని సార్లు తల్లిబిడ్డ ఇద్దరికీ ప్రమాదం పొంచి ఉండే అవకాశం ఉంది. వీటితో పాటు రోజురోజుకూ బాలికలపై, స్త్రీలపై జరుగుతున్న అకృత్యాలు మరొకటి. ఆడపిల్లకు బడిలో, గుడిలో, స్నేహితుల మధ్య, బంధువుల మధ్య, అత్తగారింట్లో చివరికి ఇంట్లో కూడా ఎక్కడా సరైన రక్షణ లేదు. ఆడపిల్లలపైన జరిగే అకృత్యాలకు అంతేలేకుండా పోయింది. 5 సంవత్సరాల పాప నుండి 80 సంవత్సరాల ముదుసలి వరకు, రోజు కూలి చేసుకునే మహిళ దగ్గర నుంచి కోట్లు సంపాదించే సినీతారల వరకు, చదువుకునే అమ్మాయి నుంచి, చదువు చెప్పే ఉపాధ్యాయుల వరకు, ప్రాణాలు తీసే రౌడీల నుండి ప్రాణాలు పోసే డాక్టరు వరకు, సిల్లీగా గల్లీలో తిరిగే కుర్రకారు నుంచి ఆధ్యాత్మిక ప్రవచనాలు చెప్పే బాబాల వరకు ప్రపంచంలో ఎక్కడో అక్కడ ప్రతిరోజు, ప్రతీ నిత్యం మనం అనేక అకృత్యాలు జరుగుతున్నట్లు చూస్తూనే ఉన్నాం. వీటిని అరికట్టి బాలికలకు సమాజంలో రక్షణ ఉందనే నమ్మకాన్ని కల్పించే బాధ్యత ప్రభుత్వం, సమాజం తీసుకోవాలి.

## బాధాకరం

నగరాలలో ఏ రహదారిపై చూసినా సరస్వతి నిలయాల్లో పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన చిన్నారులు భిక్షాటన చేస్తూ కనిపిస్తున్నారు. పిల్లల అక్రమ రవాణాను నిర్మూలించడానికి పోలీసులు, రైల్వే, రవాణా, బాలల హక్కుల కమిషన్, శిశు సంక్షేమశాఖలు సమన్వయంతో పని చేయాల్సి ఉంది. అయినా వీటిలో చాలాసందర్భాలలో ఏ ఒక్కశాఖకు మరో శాఖతో సమన్వయం లేకపోవడం ప్రధాన లోపంగా కనిపిస్తోంది. అక్రమంగా రవాణా అవుతున్న బాలలను వారి వయస్సు బట్టి పనులు మార్చేస్తున్నారు. ఐదేళ్లలోపు వారిని యాచకులుగా మార్చేస్తున్నారు. ఆరో సంవత్సరంలోకి అడుగుపెట్టగానే వారు బాలకార్మికులుగా మారిపోతున్నారు. బాలికల విషయంలో మరీ ఘోరం. 11 ఏళ్ల వయసు గల అమ్మాయిలను ఇతర ప్రాంతాలకు తరలించి వ్యభిచార రొంపి లోకి దింపుతున్నారు. వారంతా యుక్త వయస్సు చేరుకునే వరకు ఆ గృహాల్లో నిత్యం క్షోభ అనుభవిస్తున్నారు. ఇప్పటికీ మోక్షం లభించని ఎంతోమంది అక్కడే నరకం అనుభవిస్తున్నారు.



## చిట్టితల్లికి ఎన్నాళ్ళీ కన్నీళ్లు

అయితే మనదేశంలో గతకొంతకాలంగా ఆడపిల్లలపై జరుగుతున్న అత్యాచారాల్ని, హింసని చూస్తుంటే మన సమాజంలో ఎంత వికృతంగా మారిపోతోందో ఎవరి కైనా ఇట్టే అర్థమవుతుంది. ఒక ప్రత్యూష కావచ్చు, ఒక అయేషా కావచ్చు, ఒక ప్రియాంక కావచ్చు, ఒక నిర్భయ కావచ్చు లేదా ఇంకొకరు కావచ్చు. పేరు మారవచ్చు లేదా ప్రాంతం మారవచ్చు. కానీ ఆడపిల్ల కు జరిగే అన్యాయంలో మాత్రం ఏమీ తేడా లేదు. విచ్చలవిడి గంజాయి, సారా, మందు, మత్తుపదార్థాల వాడకం, పెరుగు తున్న పబ్‌కల్చర్, నోట్ల కట్టలతో న్యాయం కొనగలనన్న ధీమా, మన చట్టాలపై ఉన్న గొప్ప నమ్మకం వెరసి నేరాలు తగ్గాల్సింది పోయి రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఏదైనా ఒక దుర్ఘటన జరిగినప్పుడో లేక సంచలనం రేకెత్తించినప్పుడో మీడియా, పేపర్, రాజకీయ నాయకులు కొన్ని రోజులు గగ్గోలు పెట్టి హడావిడి చేయడం మళ్లీ షరా మామూలే. ఇలా రకరకాల కారణాల వల్ల అన్ని వర్గాల కుటుంబాలు ఆడపిల్లల భద్రత గురించి భయాందోళన లకి గురవుతున్నారనడంలో అతిశయోక్తి లేదు. నమోదు అయిన నేరాల ప్రకారమే దేశంలో రోజుకు వందల సంఖ్యలో రేప్‌లు జరుగుతున్నాయంటే, పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇళ్లలో, స్కూళ్లలో, ఆరుబయట, ఆట స్థలాల్లో, బహిర్భూము ల్లో, తిరిగే బస్సుల్లో, కార్లలో, వెల్ఫేర్ హాస్టళ్లలో ఇక్కడ అక్కడ అని తేడా లేకుం డా ఎక్కడైనా అపాయం పొంచి వుంది అనుకునేవిధంగా పిల్లలపై లైంగిక అత్యాచా రాలు పెరిగిపోయాయి. అంతేకాక 2 నుంచి 14 సంవత్సరాల వయసు పిల్లలను ప్రతి 10మందిలో ఆరుగురిని క్రమశిక్షణ పేరుతో, పిల్లల సంరక్షకులు భౌతికంగా హింసిస్తున్నట్లు యూనిసెఫ్ రిపోర్టులు చెబుతున్నాయి. అలాగే 15-19 వయసు ఆడపిల్లల్లో దాదాపు ప్రతి నలుగురిలో ఒకరు విపరీతమైన శారీరక హింసకి గుర వుతున్నట్లు తెలుస్తోంది. అన్ని వయసుల తో పోలిస్తే ఈ వయసు ఆడపిల్లలు లైంగిక అత్యాచారాలకు ఎక్కువబలి అవుతున్నారు. ఇలా పెచ్చరిల్లిన లింగభేదం హింసకు నివారణ ఉపాయాలు కనుగొనే దిశలో, ఇంతకు ముందు సామాజిక కార్యకర్తలు, హక్కుల ఉద్యమకారులు, పౌరసమాజాలు చేసిన మంచి ప్రయత్నాలు కొన్నిటిని ఇప్పుడు ప్రభుత్వాలే స్వయంగా పథకాల రూపంలో, చట్టసవరణల రూపంలో ముందుకు తెచ్చి, ప్రజా బాహుళ్యాన్ని వారి అభిప్రాయాలని పరిగణనలోకి తీసుకునే ప్రయత్నం ఎంతో కొంత చేస్తున్నాయనడం లో సందేహం లేదు. అదొక మంచి పరిణామం. అయితే ప్రభుత్వాలు ఈ ప్రయత్నాలు పిల్లలు భద్రంగా బతికే హక్కును కాపాడటంలో ఎంత సఫలీకృతం అవుతాయి. ఎక్కడ ఘోరంగా విఫలమ వుతాయి. అన్న ప్రశ్న అందరినీ వేధిస్తున్నది.

## ఆడపిల్లలంటే చులకన వద్దు

అదేంటో..! ఆడపిల్ల అనగానే అందరికీ అలుసు. బడిలో ఉపాధ్యాయుడు, గుడిలో పూజారి, బస్‌లో కండక్టర్, హాస్పిటల్‌లో డాక్టర్ ఇలా ఒకరేమిటి, ఒక్కటేమిటి.. ప్రతీరోజు ప్రతీచోట వారికి ఇబ్బందులే ఆటంకాలే. కనబడని గొంతులోనుండి విన కూడని ఆంక్షలే. అబ్బాయిలకు ఉన్నంత స్వేచ్ఛ, అవకాశం ఇంకా అమ్మాయిలకు రావడం లేదు. కొన్ని వర్గాలలో మరికొన్ని కుటుంబాలలో స్వేచ్ఛమాట అటుంచి, బతుకు వెళ్లదీయడమే గగనం అంటే అతిశ యోక్తి కాదు. వారు ఏది తినాలో, ఏ డ్రెస్సు వేసుకోవాలో, ఎవరితో మాట్లాడాలో ముందే నిర్ణయించి కట్టుదాటని కనుసైగ లలో కాలం గడపాల్సి రావడం నిజంగా బాధాకరం. అదే సమయంలో అబ్బాయిలకు ఇస్తున్న మితిమీరిన స్వేచ్ఛ, అవకాశం వల్ల మేమేందో గొప్ప అనే భావం చిన్నప్పటి నుంచి బలంగా నాటుకు పోవడం వలన కొందరు ఆడపిల్లలంటే అలుసుగా ప్రవర్తించి వారి మనోభావాలను, గుండెధైర్యాన్ని దెబ్బ తీయడానికి వెనుకాడడం లేదు. ప్రేమించకపోతే యాసిడ్ దాడులు, ఇష్టపడకపోతే కత్తులతో పొడవడాలు, ఎదురు మాట్లాడితే ప్రాణాలు తీయడాలు చేయడం వల్ల అందమైన, ఆనందమైన జీవితాన్ని ఊహించుకున్న ఒక అమ్మాయి జీవితం చీకటిలో కలిసిపోవడమో, లేదంటే చిన్నతనంలోనే మోడుగా మారిపోవడమో జరగడం నిత్య దృశ్యం. అమ్మాయిలకు అలవిమాలిన నీతులు చెప్పి ఇంట్లో ఉంచే తల్లిదండ్రులు, అబ్బాయిలకు కనీసం విలువలు చెప్పి బయటకు పంపితే కొన్నయినా అకృత్యాలను ఆపవచ్చేమో. ఇంట్లో కూడా అమ్మాయిలు వివక్షకు గురవుతున్నారు అంటే అతిశయోక్తి కాదు. తినే తిండి నుంచి, చదివే బడి వరకు వివక్ష అనేది కొన్ని కుటుంబాలలో కనిపి స్తూనే ఉంటుంది. అంతేకాక విద్యాసంస్థల్లో చదువు కొనసాగిస్తున్న వారికి భద్రత కరువయింది. పసిబాలికలపై కూడా పైశాచిక దాడులు జరుగుతున్నాయి.

## సోషల్ మీడియా ప్రభావం

ఇది ఒక సాలెగూడు అంతకుమించి విషవలయం. ఒక్కసారి అందులోకి వెళ్లామా.. తిరిగి బయటకు రాలేం.

ఇందులో దొరికే అశ్లీలతకు కొందరు యువతీ యువకులు చిక్కుకొని తమ విలువైన భావి జీవితాన్ని సర్వనాశనం చేసుకుంటున్నారు. సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగించే యువత తమను తాము ఓసారి చెక్ చేసుకోవాల్సిన అవసరం ఉంది. సామాజిక మాధ్యమాల వల్ల సమాజ సంబంధాలు బలపడేలా చేయాల్సిన బాధ్యత మనందరిది. కానీ దీని ప్రభావం వల్ల పరిచయం లేని వ్యక్తులు ప్రేమ, పెళ్లిపేరుతో దగ్గర కావడానికి ప్రయత్నించడం చివరకు ఈ బాపతు కహానీలు విషాదాంతంగా ముగియడం ప్రతిరోజూ అందరం చూస్తున్నదే.

### షీమ్స్... గుడ్ టచ్.. బ్యాడ్ టచ్

ఆ మధ్య తయారు చేసిన షీ టీమ్స్ చక్కగా పని చేస్తున్నాయని కితాబు వస్తుంది. ఇది ఒక మంచి ప్రయత్నం. రద్దీ ప్రాంతాలలో, అమ్మాయిల, మహిళా హాస్టల్ పరిసరాలలో, గుడుల దగ్గర ఇంకా అవసరమున్న చోట మఫ్టీలో తిరిగి అమ్మాయిలను వేధించే ఆకతాయిలను, నేరగాళ్లను పట్టుకుని దేహశుద్ధి చేసి అమ్మాయిలకు కావలసినంత మనోధైర్యం కలిగిస్తున్నారు. అంతేకాక పాఠశాలలను సందర్శించి అమ్మాయిలకు తగిన సూచలను చేసి ఏది మచో, ఏది చెడో తెలియ చేస్తున్నారు. అలాగే గ్రామంలో, కూడళ్లలో, పాఠశాలలో జరిగే సంఘటనలను విశదీకరించి తగిన సూచలను, సలహాలను ఇస్తున్నారు. ఇటువంటి వాటికి ప్రభుత్వం అండగా నిలిచి తగినంత వనరులు సమకూర్చవలసిన అవసరం ఎంతైనా ఉంది.

### బాలికా సంక్షేమ పథకాలు

బాలికా సాధికారిత దిశగా అడుగులు వేయడానికి ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నాయి. బడ్జెట్లో కావలసినంత మొత్తం సమకూరుస్తూ అనేక కొత్త పథకాలు ప్రవేశపెడుతున్నాయి. గ్రామాలలో అమ్మాయిలు అధికంగా ఉన్నచోట ప్రత్యేక చర్యలు చేపట్టి కొంత బడ్జెట్ కేటాయిస్తున్నారు. వారికి కావలసిన అవకాశాలు సృష్టిస్తున్నారు. వాటిలో కొన్ని:

### పీఎం ఉజ్వల యోజన

2016మే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దీన్ని తీసుకొచ్చారు. మహిళలను వంట గ్యాస్ వైపు తీసుకువెళ్లేందుకు ఈ పథకాన్ని ప్రారంభించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన ఐదు కోట్ల మంది మహిళలకు ఎల్పీజీ కనెక్షన్లు ఇవ్వాలనేది ఈ పథకం ఉద్దేశం.

### సుకన్య సమృద్ధి యోజన

సమాజంలో ఆడపిల్లలకు సమాన అవకాశాలు, ఉద్యోగాలు.. ఉన్నతమైన చదువు అందించాలని భ్రూణహత్యలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాల్లో భాగంగా సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకం ద్వారా అప్పుడే పుట్టిన శిశువు నుంచి పదేళ్ల వయసున్న ఆడపిల్ల తల్లిదండ్రులు బాలిక పేరుపై తపాల శాఖలో రూ.250 చెల్లించి ఖాతా తెరవొచ్చు. ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా రూ.1.50 లక్షల వరకు జమ



చేయవచ్చు. ఖాతా ప్రారంభం 14 ఏళ్లు, గరిష్టంగా 21 ఏళ్ల వరకు ఖాతా నిర్వహించవచ్చు. బాలికకు 18 ఏళ్లు వచ్చాక చదువుకోసమైతే సగం డబ్బులు తీసుకోవచ్చు. చేసిన పొదుపుపై వడ్డీ ఉదాహరణకు నెలకు వెయ్యి చొప్పున 14 ఏళ్లు జమ చేస్తే 21 ఏళ్ల తర్వాత 6,07,128 రూపాయలు వస్తాయి.

21 ఏళ్ల తర్వాత బాలిక వివాహ ధ్రువీకరణ పత్రాన్ని తపాలా కార్యాలయంలో అందజేస్తే పూర్తి మొత్తం అందజేస్తారు. ఇద్దరు బాలికలున్నవారు రెండు ఖాతాల్లో విడివిడిగా సొమ్ము జత చేయాలి. ముగ్గురు కుమార్తెలుంటే మరో ఖాతా తెరిచేందుకు వీలు లేదు.

### బేటీ బచావో-బేటీ పడావో

ఆడపిల్లల విద్యను ప్రోత్సహించడం కోసం దీన్ని తీసుకురావడం జరిగింది. మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, విద్యా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా దీన్ని నిర్వహిస్తున్నాయి. బాలికల సంరక్షణకు, బాలికల ఉన్నతికి 2015 జనవరి 22న హర్యానాలోని పానిపట్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇకనుంచి బాలిక పుడితే మనం పండగ జరుపుకోవాలి. కూతురు పుట్టగానే ఐదు మొక్కలు నాటి సంబరం చేసుకోవాలి, కూతురు పుట్టినందుకు మనం గర్వపడాలని అభిలశించారు. ఈ పథకాన్ని కేంద్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, మానవ వనరుల అభివృద్ధి శాఖలు సమన్వయంతో నిర్వహిస్తాయి.

### మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో..

సామాజిక ప్రగతి సాధనకు మహిళలు, పిల్లలు తమ వంతు సహకారాన్ని అందించాల్సి ఉంటుంది. దీనిని గుర్తించిన మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సంక్షేమ మహిళలు, పిల్లల సంరక్షణ కోసం అనేక పథకాలు అమలు చేస్తోంది. ఆత్మ విశ్వాసంతో జీవిస్తూ నవ సమాజ స్థాపనలో మహిళలు, పిల్లలు తమ వంతు పాత్ర నిర్వర్తించేలా చేసేందుకు అవసరమైన వాతావరణ పరిస్థితిని వీరికి అందుబాటులోకి తెచ్చి వీరికి అవసరమైన పౌష్టిక ఆహారాన్ని అందించేందుకు మంత్రిత్వ శాఖ కృషి చేస్తోంది.

### మిషన్ పోషణ్ 2.0

పిల్లలు, కౌమార దశలో ఉన్న బాలికలు, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులలో పోషకాహార లోప సమస్యను పరిష్కరించేందుకు మిషన్ పోషన్ 2.0 సమీకృత పోషకాహార పథకంగా అమలు కానున్నది. ఆరోగ్యం, రోగనిరోధక శక్తిని పెంపొందించే పద్ధతులను అభివృద్ధి చేసి ప్రోత్సహించడానికి పోషకాహార రకాల్లో మార్పులు చేసి వాటిని సకాలంలో అవసరమైన వారికి అందించాలన్న లక్ష్యంతో మిషన్ పోషణ్ 2.0ను రూపొందించారు.

### మిషన్ శక్తి

మహిళా సంక్షేమం, సాధికారత లక్ష్య సాధన కోసం మిషన్ శక్తికి రూపకల్పన జరిగింది. మహిళలు తమ జీవితంలో వివిధ దశల ద్వారా పురోగమిస్తున్న సమయంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించి సంరక్షణ, భద్రత, రక్షణ,

పునరావాసం, సాధికారత కూడి ఏకీకృత పౌర కేంద్రీకృత జీవితం సాగించేందుకు సహకారం అందించాలని మిషన్ శక్తి భావిస్తోంది.

### మిషన్ వాత్సల్య

అత్యున్నత జాతీయ ఆస్తులతో పిల్లలు ఒకరని విధాన రూపకర్తలు గుర్తించారు. భారతదేశంలో 18 సంవత్సరాల వయస్సు వరకు 472 మిలియన్ల మంది పిల్లలు ఉన్నారు. వీరు దేశ జనాభాలు 39 శాతం వరకు ఉన్నారు.

### బాలికల సంరక్షణకు హక్కులు, చట్టాలు

బాలికలను సంరక్షించుకునేందుకు రక్షణగా ఉన్న చట్టాలను సమర్థంగా వినియోగించుకోగలిగితే స్త్రీ శక్తిని మరే ఇతర శక్తి అడ్డుకోలేదు. బాలికలకు రక్షణకు ఉన్న కొన్ని ప్రత్యేక చట్టాల న్యాయం జరగడానికి అనేక చట్టాలు చేసాయి.

అందులో కొన్ని:

2006 నుంచి బాల్య వివాహాల నిరోధక చట్టం అమల్లోకి వచ్చింది.

2014 నుంచి బాలల అక్రమ రవాణా నిరోధక చట్టం అమలవుతోంది.

దాడులకు గురైన బాలికలకు వన్ స్టాప్ సెంటర్ (సఖి) అండగా నిలుస్తోంది.

అత్యాచార నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించే చట్టానికి 2012లో ఆమోదం లభించింది. బాలిక ఆమోదం తెలిపినా, తెలపకపోయినా 18 ఏళ్లలోపు వారిపై ఏ రకమైన లైంగిక దాడి చేసినా ఏడేళ్లకు తగ్గకుండా జైలుశిక్ష, జరిమానా లేదా జీవిత ఖైదు కూడా విధించవచ్చు. పిల్లలపై అత్యాచారం లేదా వేధింపులు గురి చేస్తే 3 నుంచి 5 ఏళ్ల జైలుశిక్ష, జరిమానా, రెండోసారి అదే నేరంపై దొరికితే ఏడేళ్ల జైలుశిక్ష జరిమాన విధించే అవకాశం ఉంది. 18 ఏళ్లలోపు బాలికలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు జరిగితే ఫోక్సో చట్టం కిందికి వస్తాయి. 2016 నుంచి ఈ చట్టాన్ని అమలు చేస్తున్నారు. సమాజంలో జరుగుతున్న దాడులు, బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

పదే పదే అనేక సందర్భాల్లో పాలకులు ఉటంకించే మాట. ప్రధానంగా బాలికలను, వారి తల్లిదండ్రులను బాగా వేధించే సమస్య బాలికల అక్రమ రవాణా. పౌరులుగా ఎదగాల్సిన బాలలు కొన్ని ముఠాల చేతుల్లో బానిసలుగా మారిపోతున్నారు. సమాజాన్ని అర్థం చేసుకునేలోపు వారి జీవితాలు నలిగిపోతున్నాయి. వారి ఆనందాన్ని, ఆశలను కొన్ని శక్తులు చిదిమేస్తున్నాయి.

### అవగాహన అవసరం

బాలికలు, యువతుల సంరక్షణ, సాధికారత, బాల్య వివాహాల నిర్మూలన, హక్కుల పరిరక్షణ వంటి అంశాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకోసం స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి. కౌమార దశలో ఆడపిల్లలు, యువతులు ఎదుర్కొనే వివిధ రకాల హింసను అంతం చేయాలి. హింసను ఎదుర్కోవడమే కాకుండా, లేకుండా చేయడానికి ఆడపిల్లలు తమ శక్తిసామర్థ్యాలను గుర్తించేలా చేయాలి. కిశోర బాలిక మహిళగా రూపొందే కీలక దశ కౌమార దశ. ఆమెను వర్తమానంలోనే కాదు భవిష్యత్తులోనూ సాధికారతా దిశలో నడిపించడానికి ఆమెకు అవగాహన అవసరం. ఆమెను చైతన్యం చేయడం అవసరం. కిశోర బాలికలకి



సాంకేతిక, వృత్తి విద్యా అవకాశాలు కల్పించాలి. శిక్షణ ఇవ్వాలి. తన జీవితాన్ని తాను తీర్చి నడిపించుకునేందుకు వృత్తినైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, జీవన నైపుణ్యాలు, ఆసమాజిక, ఆర్థిక, ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించాలి. శిక్షణలు ఇవ్వాలి. ఒకరి మీద ఆధారపడకుండా తను స్వయంగా ఎదిగే అవకాశాలను ఇవ్వగలగాలి.

### వారిని ఎదగనిద్దాం.. బంగారు భవితకు బాటలు వేద్దాం..

రాజధాని నడిబొడ్డున కదిలే బస్సులో ఆరుగురు కామందులు ఒక అమ్మాయిని అత్యంత పాశవికంగా అఘాయిత్యం చేయడం, దేశమంతా ఉప్పెనలా కదిలి ప్రభుత్వాన్ని కదిలించిన సంఘటనల తర్వాత నిర్భయ చట్టం అమలులోకి వచ్చింది. అయినా దేశంలో ఇంకా అఘాయిత్యాలు ఆగడం లేదు. ఈ మధ్యలో కూడా మజీదు మౌల్వాలు, గుడి పూజారులు, చర్చి పాస్టరులు.. ఇంకా అనేక ఉన్నత పదవులలో ఉన్నవారు ఆడపిల్లల మీద అఘాయిత్యాలు చేస్తున్న ఘటనలు కోకొల్లలు. ఈ పరిస్థితుల నుంచి మన అమ్మల్ని, అమ్మాయిలని, భావిభారత బాలికలని కాపాడడానికి ఎన్ని వందల సీసీ కెమెరాలు అతికించాలి ఈ భారతావని చుట్టూ? సీసీ కెమెరాలతో సమస్యకి శాశ్వత పరిష్కారం దొరుకుతుందా? బాల్య వివాహాలని నిరోధిస్తూ బాల్య వివాహాల నిషేధ చట్టం, అత్యాచారాలను నిరోధిస్తూ నిర్భయ చట్టం, బాల కార్మిక వ్యవస్థని రూపుమాపడానికి బాలకార్మిక నిషేధ చట్టాలు వచ్చాయి.

### ఇలా అయితే మార్పు కష్టం

బాల్య వివాహాల్లో భారత్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచంలోని బాల్య వివాహాల్లో 40 శాతం భారత్‌లోనే జురుగుతున్నాయని యునిసెఫ్ వెల్లడించింది. దేశంలో ఏటా 2.66 కోట్ల బాల్య వివాహాలు జరుగుతున్నాయని ఒక అంచనా. అలాగే ప్రస్తుత లెక్కల ప్రకారం దేశంలో ఏడు లక్షల మంది అమ్మాయిలు బాల కార్మికులుగా ఉన్నారు.

### అందరి సహకారం

ఈ చట్టాలు పూర్తి స్థాయిలో ఆచరణకి నోచుకోవడానికి, ప్రభుత్వాలకి, రాజకీయ నాయకులకి రాజకీయ దృఢత్వం ఎంత అవసరమో, ప్రజా బాహుళ్యానికి సామాజిక చైతన్యం, ప్రజల భాగస్వామ్యం అంతే అవసరం. మన సమాజాలని అభివృద్ధి చేసుకుంటున్నాం అనుకుంటూ, సంపదని మాత్రమే సృష్టించుకుంటూ పోతున్న మనం, సంపదని పెంచడంతో పాటు సమాంతరంగా మానవీయ విలువకి పునాదులు వేయడం, మానవ హక్కుల్లో భాగంగా మహిళలు, పిల్లల హక్కులపై స్పృహ పెంచడం ఎంతైనా అవసరం. "నేటి బాలికలే రేపటి నాయకురాళ్లు.. బాలికలను పుట్టనిద్దాం, బతకనిద్దాం.. సంరక్షిద్దాం.. సమాజంలో ఎదగనిద్దాం.. దేశాభివృద్ధికి తోడ్పడుదాం" అనే నినాదాన్ని మనందరం మనస్ఫూర్తిగా పాటించినప్పుడే జాతీయ బాలిక దినోత్సవాన్ని సార్థకం చేసుకున్నవాళ్లమవుతాం.

## పుస్తక సమీక్ష

# చిన్నదే అయినా మిన్నది



శ్రీనూవాసా 'తోరపు దారాలు'లో 32 చిన్న కథలున్నాయి. 'నామాట'లో రచయిత వివరించినట్లు, ఇవన్నీ స్వానుభవంలోకి వచ్చిన సంఘటనకు రూపం కల్పించబడ్డాయి. అందుకే ఇవి అత్యంత సహజంగా, చదువుతోన్న పాఠకుడికి ఎప్పుడో ఒకప్పుడు అనుభవంలోకి వచ్చిన సంఘటనలుగా అనిపిస్తాయి. ఈ కథల్లోని మరో ప్రత్యేకత ఎక్కడా 'సాగదీత' కనిపించకపోవటం. 'ముఖపుస్తకం' అన్నది నేటి 'సాంకేతిక రంగం సృష్టించిన అద్భుతమైన ఓ సమాచార పరికరం. లోగడ ఇవన్నీ ముఖపుస్తకంలో ప్రచురించబడిన, సమకాలీన సమాజాన్ని ప్రతిబింబింపచేస్తోన్నవే! కథలన్నీ మంచిని బోధిస్తాయి. సాటివ్యక్తి యెడల సానుభూతిని చూపమని, వారిని అవసరంలో ఆదుకోవాలని చెబుతాయి (తోరపు దారం కథ). 'కామందు' కథలో ఎంకన్న ఐదో కొడుకు మల్లిని కామందు గవర్రాజు దగ్గరకు తీసి ఆదుకుని ఆదరించి అక్కున చేర్చుకోవటం కూడా ఇదే 'మంచి' గుణాన్ని మనలో పెంచమన్న సందేశం ఇస్తుంది. ఇలాంటి మంచితనం మనుషుల్లోనే కాదు. జంతువుల్లోనూ కనబరుస్తారు. (ఋణం-2కథ). 6 అంకెల జీతగాడు సుధాకర్ అయినా, నాలుగంకెల జీతగాడు వాచ్‌మెన్ అయినా, జీవితం ఒక్కటే అన్న నగ్నసత్యాన్ని 'అదేపరిస్థితి' కథ చెబుతుంది. 'ఓవర్‌డోస్' కథ నాటి రాజుల్ని రాణుల్ని నేటి కాలానికి ప్రవేశపెట్టి కథ చివరన 'నీతి' చెప్పటం రచయితకు వైవిధ్యం పట్ల ఉన్న ఆసక్తిని తెలియచేస్తుంది. సాధారణ సంఘటనలతో రసానుభూతి కలిగించారు రచయిత.

**(తోరపు దారాలు, రచన: శ్రీనూవాసా, వెల: రూ 100, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్)** - **కూర చిదంబరం**

# తెలంగాణ సాయుధ పోరాటంలో 'పిండిప్రోలు'



'తెలంగాణ సాయుధ పోరాటంలోఒక ఊరు పిండిప్రోలు' 1945 ప్రాంతంలో దాదాపు 2వేల జనాభాతో, భూస్వామి నూకల జగన్నాథరెడ్డి, పేరెక్కిన దేశ్‌ముఖ్‌గా, తన గడ్డిపై అసఫ్జాహీ జెండా కట్టుకొన్న రోజుల నాటి చరిత్ర యిది. డా.కె. ముత్యం, రేపాకుల శివలింగం యిద్దరూ రచయితలు, పరిశోధనాకారులుగా నాటి భూస్వామ్య ఆర్థిక, రాజకీయ, ఆధిపత్య నేపథ్యాన్ని, 70 ఏళ్లనాటి సాయుధరైతాంగ పోరాటాన్ని వెలికితీసి ప్రచురింపచేసారు. భూమి కోసం పోరాడిన కర్మవీరులు, సమ సమాజ నిర్మాణ స్వాప్నికులు, ప్రాణత్యాగాలు చేసిన పిండిప్రోలు ప్రాంత కమ్యూనిస్టు యోధుల స్మృతికి అంకితం చేయబడిన ఈ పోరాటగాథలో స్థానిక భూస్వామ్య వ్యవస్థమీద, గడీలమీద, పోలీస్‌స్టేషన్ల మీద సాయుధదాడులు, కమ్యూనిస్ట్‌ల అమరత్యాగాలు, ఆంధ్రమహాసభ, రజాకారు హంతక ముఠాలు, నిజాం ప్రభుత్వ సాయుధపోలీసుల దౌర్జన్యాలు, గెరిల్లా దళాల నిర్మాణం, నాటి ప్రతిఘటనోద్యమాలను రచయితలు కళ్లకు కట్టించారు. సుందరయ్య, మంచికంటి, చిర్రావూరి, దాశరధి, చంద్ర వంటి నాయకులు, షోయబుల్లాఖాన్, కవిరాజమూర్తి, కొండపల్లి, శీలం, చుండూరి, కొల్లులాంటి ఎందరో సాయుధపోరాట యోధుల అలభ్య సమాచారం ఇంటర్వ్యూల ఆధారంగా పుస్తకాల, కథనాలు, సంఘటనల పిండిప్రోలుకు పరిమితమైనా తెలంగాణ రైతాంగ సాయుధపోరాటాన్ని ప్రతిబింబింప చేస్తున్నాయి.

**(పిండిప్రోలు, రచన:, పరిశోధన: డా॥కె.ముత్యం, ఆర్.శివలింగం, వెల: రూ 150, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్)** - **ఎర్రమిల్లి**

# ఆరు ఋతువుల కమనీయ వర్ణన



ఇదివరలో మహాకవి కాళిదాసు విరచిత 'మేఘ సందేశమే' కావ్య తెలుగు వచన కవితానువాదాన్ని ప్రచురించిన కవి రఘువర్మ తన ద్వితీయ ప్రయత్నంగా కాళిదాసు మరో ఖండ కావ్యం 'ఋతు సంహారః'కు వివరణాత్మక స్వేచ్ఛావచన కవితానువాదాన్ని తాజాగా గ్రంథరూపంలో వెలువరించారు. 'ఋతు సంహారం'మంటే ఋతువుల సమూహమని అర్థం. ఒక్కో ఋతువులో ఒక్కో దివ్యానుభూతికి గురవుతారు. యిది మానవ స్వభావం. ఆరు సర్గల్లో రఘువర్మ ఆరు ఋతువులు వర్ణించిన తీరు అద్భుతం. మొత్తం 144 పద్యాల్లో ఈ వర్ణన కొనసాగింది.

'కామోపశమనం చేసే గ్రీష్మం వచ్చేసింది' అంటూ కావ్యంలోకి మనల్ని ప్రవేశబెట్టి సరళమైన భాషలో కావ్యం ఆసాంతం చదివింపజేస్తారు. వర్షఋతువు, శరదృతువు, హేమంతం, శిశిరం, వసంతం..ఇలా ఒక్కో ఋతువులో ఏఏ భావనలు స్ఫురిస్తాయో అనుభవంలోకి వచ్చేలా వుంటుంది కవి వర్ణన. 'ఎవ్వనికి కోకిలలు కైవారులో, అజితస్వభావన మన్మథుడు/ వసంతునితో కలిసి మీకు శుభాల కూర్చుగాక!' అంటూ స్వస్తి కావ్యం పలకటం బాగుంది. 'ఋతుసంహారం!' స్వేచ్ఛానువాద వచన కవిత్వపఠనం ఓ చక్కని అనుభవం.

**(ఋతు సంహారః, స్వేచ్ఛాకవితానువాదం, రచన: రఘువర్మ, వెల: రూ 125, ప్రతులకు: నవచైతన్య, నవోదయ బుక్‌హౌస్)**

**- రమణ వెలమకన్ని**

# 'తెలుగు-ఉర్దూ నిఘంటువు'



నిఘంటువులు కల్పవృక్షాల వంటివి. భాషాభిమానులకు, పాఠకులకు కావల్సిన పదాలకు అర్థాలు అందించి సందేహనివృత్తిని చేస్తాయి. ప్రతిభాషకు నిఘంటువులు చాలా అవసరం. నిఘంటు నిర్మాణం ఎంతో శ్రమతో, అంకితభావంతో చేసే మహత్తర కార్యక్రమం. లక్ష్మణ్‌రావు పతంగే తెలుగు భాషాసాహిత్య బోధనలో 4 దశాబ్దాల అనుభవం గల వారు వీరికి హిందీ, ఉర్దూ, తెలుగు, మరాఠీ, ఇంగ్లీషు భాషల్లో మంచి పట్టు వుంది. ఉర్దూ ఛందశ్శాస్త్రాన్ని తెనిగించారు. తెలంగాణ జనపదాలు, ఉర్దూ-తెలుగు నిఘంటువు. తెలుగు-ఉర్దూ నిఘంటువు లను, హిందీ-ఉర్దూ జాతీయాలు-సామెతల నిఘంటువు, తెలంగాణలో ఉర్దూభాష, అనే నిఘంటువులను కూర్చారు. ఈ పుస్తకం తెలుగు-ఉర్దూ భాషా ప్రేమికుల్ని ఎంతో అలరిస్తుంది. మరెంతగానో ఉపకరిస్తుంది. ఇందులో పదాలు, పదబంధాలకు కొన్ని వాక్యాలకు సమానార్థక పదాలు ఇవ్వబడ్డాయి. ఈ నిఘంటువులో తెలుగు ఆరోపాటే కాక, చిన్నచిన్న వాక్యాలకు ఉర్దూ సమానార్థక పదాలు ఇచ్చారు. నిఘంటు నిర్మాణంలో ఇదో కొత్త పద్ధతిగా చెప్పాలి. ఈ ఉర్దూపదాలు చాలా మనం వాడుకలో ఉపయోగించినవే కనిపిస్తాయి. దాదాపు 9000ల పదాలున్నాయి.

**(తెలుగు-ఉర్ద నిఘంటువు, రచన: లక్ష్మణ్‌రావు పతంగే, వెల: రూ 160, ప్రతులకు: నవోదయ, నవతెలంగాణ బుక్‌హౌస్)**

**- తంగిరాల చక్రవర్తి**

# ఒడిశా ఒడిలో టిబెట్



పచ్చని కొండకోనల నడుమ భిన్న సంస్కృతుల సమ్మేళనాన్ని చూడాలంటే దేశ సరిహద్దులను చేరుకోవాలి. అయితే అంత దూరం వెళ్లడం సాధారణ ప్రజలకు సాధ్యం కాదు. అలాంటివారి కోసం విశాఖ జిల్లాలో అరకు ప్రకృతి ప్రసాదించిన వరమని చెప్పవచ్చు. అయితే దీనికి పోటీపడుతూ ఒడిశా సరిహద్దుల్లో ఉన్న మహేంద్రగిరి పర్వతావళి పర్యాటకులకు మరో కానుకనే చెప్పాలి. అచ్చం టిబెట్ వాతావరణాన్ని పోలి ఉండే ఇక్కడి వాతావరణం సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తోంది.

ఒడిశాలోని కొరాపుట్ జిల్లాలోని డియోమలి పర్వతం తర్వాత ఆ రాష్ట్రంలో రెండో ఎత్తయిన పర్వతం మహేంద్రగిరి. సముద్ర మట్టానికి సుమారు అయిదు వేల అడుగుల ఎత్తులో తూర్పు కనుమల్లో ఉన్న మహేంద్రగిరి ఎక్కేందుకు ఒడిశాలోని గజపతి జిల్లా కేంద్రమైన పర్లాకిమిడి చేరుకోవాలి. దాదాపు పన్నెండు వందల రకాల జాతులకు చెందిన మొక్కలు ఈ పర్వతం పైన ఉన్నట్లు తెలుస్తోంది. ఒడిశా రాష్ట్రంలోని వివిధ పుష్పజాతులకు చెందిన మొక్కల్లో సుమారు నలభై శాతం మొక్కలు ఈ పర్వతం పైన ఉన్నాయని సమాచారం. ఔషధ గుణాలు కలిగిన మొక్కలెన్నో ఉన్నాయిక్కడ. అంతరించిపోతున్న అత్యంత అరుదైన ఔషధ గుణాలు కలిగిన మొక్కలు సైతం ఈ పర్వతం పైన ఉన్నాయి.



అంతేకాదు, టిబెటెన్‌లు నివసించే ఆరు గ్రామాలు ఇక్కడ ఉన్నాయి. చలిలోనూ ప్రతిరోజూ వేడినీరు ఉబికే తప్తపాని కేంద్రం పర్యాటకులకు మరో అదనపు ఆకర్షణ. ఈ సీజన్‌లో ఇక్కడి ప్రకృతి అందాలు మరింత రెట్టింపు అవుతాయి. ప్రకృతి సిగలో దాగిన అరుదైన టిబెటెన్ పర్యాటక ప్రాంతాల విశేషాలు..

ఒడిశాలోని పర్లాకిమిడికి 150 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతాలు ఉన్నాయి. శ్రీకాకుళం నుంచి పర్లాకిమిడి సుమారు అరవై కిలోమీటర్లు. అక్కడి నుంచి మహేంద్రగిరి కొండల పక్క నుంచి వెళ్తుంటే నిజంగానే టిబెట్‌లోకి వచ్చేశామా! అన్న అనుభూతి కలుగుతుంది.

టిబెటెన్లు నివసించే చంద్రగిరిలో ఉంటే టిబెట్‌లో ఉన్న అనుభూతి కలుగుతుంది. అక్కడి కట్టడాలు, ఆలయాలు, ఇళ్లు చూస్తుంటే నిజంగానే టిబెట్‌లో ఉన్న అనుభూతి కలుగుతుంది. ఇక్కడ ఇళ్లు చెక్కలతో నిర్మించుకోవడం విశేషం. చాలా ఏళ్ల క్రితం టిబెట్ నుంచి ఇక్కడికి వచ్చి స్థిరపడిన కటుంబాలున్నాయి. బౌద్ధుల ఆరాధ్యదైవమైన తథాగతుని ఆలయం ఉందిక్కడ..

**టిబెటెన్ల సంస్కృతి**

భారత్‌లోకి 1967లో వలస వచ్చిన టిబెటెన్‌లకు దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో భారత ప్రభుత్వం ఆవాసాలు కల్పించింది. ఇందులో భాగంగానే ఒడిశాలోనూ కొండప్రాంతంలో ఆరు గ్రామాలను వారి కోసం కేటాయించింది. అప్పటి నుంచి వారు అక్కడే జీవనం సాగిస్తున్నారు. ప్రారంభంలో దాదాపు రెండు వేల అయిదు వందల మంది జనాభా ఉండగా ఇప్పుడు ఆ సంఖ్య కొంచెం పెరిగింది.

వీరిలో ఎక్కువ మంది ఆర్మీలో పని చేస్తున్నట్టు తెలుస్తోంది. భాష వేరైనా ఒరియా, హిందీ కలిపి మాట్లాడుతుంటారు. వ్యవసాయం చేసుకునేవారికి కావాల్సిన అవసరాలు సహకార సంఘం చూస్తుంది.

**తప్తపాని:** భూగర్భంలో ఉన్న కొన్ని రసాయన ఖనిజాల కారణంగా నీరు ఇక్కడి నీరు వేడిగా ఉంటుంది. ఈ నీటితో స్నానం చేస్తే చర్మవ్యాధులు తొలగిపోతాయని స్థానికుల విశ్వాసం. ఈ ప్రదేశం బరంపురానికి దగ్గరలో ఉంటుంది.


**దారింబడికి:** చాలా ఎత్తయిన ప్రదేశంలో ఉన్న చిన్న గిరిజన గ్రామమిది. సాధారణ పరిస్థితుల్లో చలి తీవ్రంగా ఉంటుంది. కొన్నిసార్లు జీరో డిగ్రీ ఉష్ణోగ్రత నమోదవుతుందట. ❏



# పురుషులందు పుణ్యపురుషులు వేరయా

**ముఖం మీద నిరంతరం చెరగని చిరునవ్వుతో జీవితాన్ని ప్రేమిస్తూ, తనను అభిమానించి గౌరవించే పిన్న వయస్కులను జ్ఞాన వృద్ధునిగా ఆదరించే రచయిత, సాహితీవేత్త ప్రొ॥ డాక్టర్ ఓ.ఎ.శర్మ సరస్వతీ పుత్రునిగా, ప్రస్తుత నూతన సంవత్సర శుభవేళలో "చిత్రశోభ" (అత్యద్భుత చిత్రాలు) మానవ ప్రగతికి దోహదపడే అపూర్వ సంకలన సమ్మేళనంగా పుస్తకం వెలువరించారు.**

బహుముఖ ప్రజ్ఞాశాలి, గ్రంథ రచయిత ప్రొఫెసర్, డాక్టర్ ఒరుగంటి ఆంజనేయశర్మ, దేశానికి స్వాతంత్ర్యం రాని రోజులలో మద్రాస్ ప్రెసిడెన్సీలోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో అత్యున్నత వైద్య విద్యార్హత సాధించారు. తెలుగునాట, కరీంనగర్, అనంతగిరి, వరంగల్, తిరుపతి, హైదరాబాద్.. ఇలా పలు చోట్ల వైద్యునిగా విధులు నిర్వర్తించారు. ఉన్నత ప్రభుత్వ వైద్యాధికారిగా, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వానికి దశాబ్దాల తరబడి సేవలు అందించి బాధ్యతల విరమణ అనంతరం, దాదాపు మూడు దశాబ్దాలు పేదలకు వివిధ సంస్థల ద్వారా ఉచిత



వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం రచయిత గా సత్కృషి సాగిస్తు న్నారు. గ్రామీణ ప్రాంతాలలో నిరక్షరాస్యులైన పేదలు, తమ శారీరక వేదనను, వైద్యునికి వ్యక్తపరిచే సమయంలో ఉపయోగించే పదాల పలుకుబడి, డా॥ శర్మలో రచయితను మేల్కొల్పింది. అసంఖ్యాక నిరుపేదల రోగ సంబంధిత వేదన, బాధల వ్యక్తీకరణలు, ఆంగ్ల వైద్య పరిభాషా పదాల నుంచి తెలుగు అనువాదాల ప్రక్రియ చేపట్టారు. వైద్యునికి, రోగికి మధ్య 'మాట' అవరోధం కాకూడదని, యువ వైద్యుల కు, వైద్య విద్యార్థులకు, తెలుగు పల్లెలలో వాడుకలో వున్న వైద్య సంబంధిత పలుకుబడులు, ఆయుర్వేద పదజాలం విద్యా, వైద్యవేత్తగా నిఘంటు వుల రూపకల్పన చేపట్టారు.

నిరంతర అధ్యయనం, వైద్యులకు విద్యార్థులకు కరదీపికగా 6 మహా వైద్య నిఘంటువుల సృష్టికర్తగా డా॥ శర్మ అనితర సాధ్యమైన సత్కృషి తెలుగులో మణిదీపమనదగ్గ గ్రంథాల రచయితగా,



50,000 పదాల వైద్య నిఘంటువు ఎన్‌సైక్లోపీడియా వెలుగులోకి వచ్చింది. అంతేకాకుండా జన సామాన్యానికి క్షయవ్యాధి నివారణ, స్థూలకాయ కారణాలు, తరచు వచ్చే వ్యాధులు, వాటి చికిత్స, మెడికల్ పదాల క్విజ్, అట్లాస్ ఆఫ్ చెస్ట్, టి.బి.ఎక్స్‌రే సంబంధిత వైద్య సాహిత్యాన్ని పుస్తకాలుగా రచించి అందించారు. విద్యావేత్త అయినా రచయితగా 'పదామృతం', 'అన్ని సందర్భాల సూక్తులు', 'విజ్ఞాన కాలక్షేపం' 'సామెతలు సుమధుర భాషితాలు' 'ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తలు' ఎన్నో సద్గ్రంథాలు రచించారు.

ఏ అంశమైనా అనర్గళంగా చెప్పగల ప్రజ్ఞాశాలి. బి.ఎస్.సి., ఎం.బి.బి.ఎస్, ఎమ్.డి, టిడిడి, ఎఫ్.సి.సి.పి. (యు.ఎస్.ఎ), ఎఫ్.ఎన్‌సి.సి.పి, ఎఫ్.ఐ.ఎ.ఎమ్.ఎస్, ఎఫ్.సి.జి.పి. ఎన్నెన్నో వైద్య విద్యా అర్హతలు, వివేషానుభవంగల డా॥ శర్మ ఎన్నడూ బిరుదులు, సత్కార సన్మానాలు, పద్మశ్రీ వంటి పురస్కారాలకు తాపత్రయపడలేదు, ఆశించలేదు. 'అతిహాని-మితిహాయి' జీవన శైలిగా, స్వాతంత్ర్య పోరాట చైతన్య స్ఫూర్తి, అనంతర జాతి ప్రగతిని ఆకాంక్షించే జీవన దృక్పథంతో అవిశ్రాంత సేవా తత్పరునిగా, సమాజ హితాన్ని, జనజీవన శ్రేయస్సుకు అంకితమై అడుగులు ముందుకు వేస్తున్నారు. వేమన మహాకవి పేర్కొన్నట్టుగా 'పురుషులందు పుణ్యపురుషులు వేరయా' అక్షర సత్యమని నిరూపిస్తున్న డా॥ ప్రొ॥ ఓ.ఎ.శర్మగారికి మనందరం పాదాభివందనం చేయవలసినదే. శతమానం భవతి.

**- వై.ఎస్.మూర్తి**





కథ

# పని వాయిదా పనికిరాదు

**రాము, శ్యాము మంచి స్నేహితులు. ఒకే బడిలో, ఒకే తరగతిలో చదువుతున్నారు.**
**ఇద్దరు పోటీ పడి చదువుతూ, ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యేవాళ్లు.**



అయితే శ్యాము ఈ మధ్యన అల్లరిపిల్లల సావాసం మొదలుపెట్టి, ఏరోజు చదువు ఆ రోజు చదువుకోకుండా నిర్లక్ష్యం చేయటం మొదలుపెట్టాడు.
రాము ఎంత చెప్పినా వినకుండా "పరీక్షలప్పుడు చదువుకోవచ్చులే, రోజూ చదవాలా?" అని పెడసరి సమాధానం చెబుతూ కాలం వృధా చేసాడు.
అంతలో అర్ధ సంవత్సరం పరీక్షలు వచ్చాయి. రాము ఏ రోజుపాఠాలు ఆ రోజు చదువుకుని సమయానికి హాయిగా నిద్రపోయేవాడు.
శ్యాము ఏమీ చదువుకోకపోవటం వల్ల పరీక్షల సమయంలో రాత్రంతా నిద్ర పోకుండా, నిద్ర ముంచుకొస్తున్నా బలవంతంగా నిద్ర ఆపుకుంటూ కునికిపాట్లు పడుతూ కళ్లు అలసిపోయి, కళ్లమ్మట నీళ్లు కారుతుంటే తుడుచుకుంటూ తెల్లారేదాకా కష్టపడి చదివాడు. అయినా చదువు పూర్తి కాలేదు.
పరీక్ష హాల్లో నిద్ర ముంచుకొస్తుంటే కళ్లూ మూస్తూ, తెరుస్తూ నిద్రలో వూగుతూ పరీక్షలు గజిబిజిగా రాసాడు.
రాము సరైన సమయానికి నిద్ర పోవటం వల్ల అన్ని పరీక్షలు సుఖంగా, సంతోషంగా రాసాడు.
ఇదివరకు ఇద్దరూ ఏ రోజు పాఠాలు ఆ రోజే చదువుకోవటం వల్ల త్రైమాసిక పరీక్షల్లో ఇద్దరికీ మంచి మార్కులు వస్తే ఈసారి శ్యాము చదువు నిర్లక్ష్యం చేయటం వల్ల శ్యాముకి ఘోరమైన మార్కులు, రాముకి మంచి మార్కులు వచ్చాయి.
శ్యాముకి ఏడుపు ముంచుకొచ్చి రాము దగ్గర బాధపడుతూ "నీ మాటలు వినకపోవటం వల్ల నాకు తగిన శాస్తి జరిగింది" అని భోరున ఏడ్చాడు.

రాము కన్నీళ్లు తుడిచి, ఓదార్చి "ఇవి ముఖ్యమైన పరీక్షలు కావు. యాన్యువల్ ఎగ్జామ్‌లో మార్కులు రావాలి. అప్పుడు ఎక్కువ మార్కులు రాకపోతే ఈ క్లాస్‌లోనే వుండిపోతావు. జరిగిందేదో జరిగిపోయింది. నీ తప్పు నువ్వు తెలుసుకున్నావు. ఇప్పటినుండి ఎప్పటి పాఠాలు అప్పుడు చదువుకొని. ఎప్పటి పని అప్పుడే చేసుకో. పని వాయిదా పనికిరాదు" అని సలహా ఇచ్చాడు.
శ్యాము చెప్పినట్లే చేసాడు రాము.
ఇద్దరూ యాన్యువల్ ఎగ్జామ్స్‌లో అధిక మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. ఇద్దరూ చాలా సంతోషించారు.

**- మా.శ్రీ.రాజు**

## చుక్కలు కలపండి








# వార్త ఆదివారం

## బాలగేయం

### పాపాయి స్నేహాలు



ఉసిరికాయ తెచ్చింది
ఉడుతపిల్ల/
పాపాయికిచ్చింది/
ఉడుతపిల్ల/ జాంపండు
తెచ్చింది/ రామచిలుక
పాపాయికిచ్చింది
రామచిలుక
కమ్మని పాట పాడింది
కోయిలమ్మ
పాపాయికి నేర్పింది
కోయిలమ్మ/ నాట్యం
చేసింది/ నెమలిపిల్ల
పాపాయికి నేర్పింది
నెమలిపిల్ల
మ్యావ్.. మ్యావ్
అంది పిల్లిపిల్ల
మిమిక్రీ నేర్పింది
పాపాయికి పిల్లిపిల్ల
మే..మే అంది మేకపిల్ల
పాపాయికి మే నెల పేరు
నేర్పింది మేకపిల్ల.

**- ఎస్.జయచంద్రారెడ్డి**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**- సుబ్రహ్మణ్యం,** ఆత్మకూరు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. మంచినీళ్ల ఎక్కువగా తాగాలని అందరూ అంటుంటారు..ఎందువల్ల?**

**జవాబు:** సుబ్రహ్మణ్యం! ఏ విషయంలోనైనా అతి మంచిది కాదు. 'అతి సర్వత్ర వర్జయేత్'. ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ తగినన్ని నీళ్ల తాగాలని మనందరికీ తెలిసిందే. కానీ నీటిని సైతం అవసరానికి మించి తీసుకుంటే తిప్పలు తప్పవు. అధిక మోతాదులో నీటిని తీసుకోవడం వల్ల శరీరంలోని సోడియం లవణాల సాంద్రత చాలా తగ్గిపోతుంది. ఫలితంగా దుష్ఫలితాలు కలుగుతాయి. ప్రతిరోజూ ఎనిమిది నుంచి పది గ్లాసుల నీళ్ల తాగాలి. కానీ శరీరంలో నీటి పరిమాణం పెరిగితే ఆరోగ్యానికి చిక్కే. మన శరీరానికి అత్యవసరమైన సోడియం పరిమాణం మీద నీరు ప్రభావం చూపిస్తుంది. రక్తంలోని సోడియం శరీర జీవక్రియల్లో ప్రధాన పాత్ర వహిస్తుంది. నీళ్ల మోతాదుకు మించి తాగడం వలన రక్తంలోని సోడియం మోతాదు తగ్గి, ఈ ప్రక్రియలన్నీ మందగిస్తాయి. తద్వారా శరీరం బలహీనమవుతుంది. చురుకుదనం తగ్గుతుంది.

**- కార్తిక,** గుంటూరు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. మన శరీర ఉష్ణోగ్రత ఎంత ఉంటుంది? జ్వరం ఏ స్థాయిలో వస్తుంది?**

**జవాబు:** కార్తిక! శరీర ఉష్ణోగ్రత ఎప్పుడూ స్థిరంగా ఉంటుందనీ, సాధారణంగా ఉండే గది ఉష్ణోగ్రత కన్నా అది ఎక్కువగా ఉంటుందనీ రాబర్ట్ బాయిల్(బ్రిటన్) అనే శాస్త్రజ్ఞుడు ప్రప్రథమంగా గుర్తించారు. సాధారణంగా మన శరీర ఉష్ణోగ్రత 98.4 డిగ్రీల ఫారన్‌హీట్ లేదా 37 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉంటుంది. ఇంతకు మించి పెరిగితే మన శరీరానికి జ్వరం వచ్చినట్లుగా గుర్తించాలి. పెరిగిన ఉష్ణోగ్రత కొన్ని సందర్భాల్లో స్పష్టంగా తెలియదు. అప్పుడు 'లోజ్వరం' వచ్చినట్టుగా గుర్తిస్తారు.





**"పందులకేం** తెల్సు పాండ్స్ పౌడర్ వాసన?" ఇదో సినిమా డైలాగ్. అయితే ఈ డైలాగ్ తప్పు అని మనం ఇప్పుడు తెలుసుకునే విషయాన్ని బట్టి అర్థమవుతుంది. అవును మరి .. ఇక్కడ పందులకు ఫైవ్ స్టార్ సౌకర్యాలతో పాటు రాజ భోగాలు సమకూర్చుతున్నారు. అసలు అక్కడి భవనాన్ని చూడగానే ఎవరికైనా ఇదేదో బడా కార్పొరేట్ కంపెనీ బిల్డింగ్ అనిపిస్తుంది. అదీ కాదనుకుంటే సింగపూర్ లాంటి దేశంలోని ఓ పెద్ద లగ్జరీ హోటల్ అని అనుకుంటారు. కార్పొరేట్ కంపెనీలను తలదన్నే భవనంలో



# విలాసవంతమైన జీవనం

పందులకు సకల సౌకర్యాలను సమకూర్చుతున్నారు. ఎయిర్ కండిషన్‌తో సహా పందుల కోసం ఏకంగా 26 అంతస్తుల పిగ్ హోటల్‌నే నిర్మించారు. ప్రపంచంలోనే అతి పెద్దదైన ఈ భారీ పందుల భవనాన్ని పిగ్ హోటల్ అని పిలుస్తారు.

చైనాలోని హుబే ప్రావిన్స్‌లోని ఎజౌ నగరంలో ఉందీ పందుల హోటల్. అంత పెద్ద పిగ్ ఫామ్ ప్రపంచంలో మరెక్కడా లేదు. యూరప్‌లోని పలు దేశాల్లో ఉన్నాయిగానీ అవి చాలా చిన్నవి. ఆ బిల్డింగులు మూడంటే మూడు అంతస్తులకు మించలేదు. వాటిలో కొన్ని మాత్రమే ఇప్పుడు రన్ అవుతున్నాయి. సామూహికంగా గదుల్లో పెంచిన పంది మాంసాన్ని తినడానికి జనాలు అంతగా ఆసక్తి చూపించలేదు. అందుకే యూరప్‌లో ఇలాంటి ఫామ్స్ మూతపడ్డాయి. అందుకు భిన్నంగా చైనాలోని ఈ భవనం పందుల పెంపకందారులను ఆశ్చర్యానికి గురి చేస్తూ 26 అంతస్తులతో ఆకాశం వైపు పరుగులు పెట్టింది. ఒక్కో అంతస్థులో 10 వేల పందులను పెంచేందుకు వీలుగా నిర్మించారు. 4 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ భవనం నిర్మించారు. ఇక ఇందులోని ఆధునిక టెక్నాలజీని చూస్తే మతి పోవాల్సిందే. సాధారణ పశువుల పాకలు, పందుల దొడ్లకు భిన్నంగా అత్యాధునిక సాంకేతికతను వినియోగించి ఏర్పాట్లు చేశారు. ఇందులో ఆటోమేటెడ్ ఫీడింగ్ మెషీన్లు ఉంటాయి. అంటే ప్రత్యేకంగా పందులకు మేత వేయాల్సిన పనిలేదు. ఫీడింగ్ మెషీన్లు లేకుంటే ఒక్క అంతస్తులోనే 10 వేల పందులు ఉంటే 26 అంతస్థుల్లో ఉన్న వాటికి ఎంత మంది పనివాళ్లు కావాల్సి ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు, సమయానికి మేత అందించేందుకు ఆటోమేటెడ్ ఫీడింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. దీనికితోడు స్మార్ట్ ఎయిర్ ఫిల్టరేషన్ సిస్టమ్ కూడా ఉంది. ఇన్‌ఫెక్షన్లు సోకకుండా క్రిమి సంహారక వ్యవస్థలను సైతం ఇందులో అందుబాటులోకి తెచ్చారు. పందుల వ్యర్థాలను శుద్ధి చేసేందుకు బయోగ్యాస్ ఆధారిత వ్యర్థాల శుద్ధి కేంద్రాన్ని సైతం ఏర్పాటు చేశారు. రీసైక్లింగ్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి కూడా చేపట్టడం విశేషం. మొత్తంగా ఈ పిగ్ హోటల్ నుండి సంవత్సరానికి 54 వేల టన్నుల పంది మాంసం ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఈ స్థాయిలో పందులను పెంచడం గతంలో చైనాలో ఎన్నడూ లేదు. గడచిన మూడేళ్లగానే ఈ బిజినెస్ ఊహించని స్థాయిలో ఊపందుకుంది. చైనాలోని రైతులు బిలియన్ల డాలర్లకొద్దీ డబ్బును ఇలాంటి పిగ్ హోటళ్లలో పెట్టుబడిగా పెడుతున్నారు. ఎందుకు ఇంత భారీగా పందులను పెంచుతున్నారంటే ఆఫ్రికన్ స్వైన్ ఫ్లూ కొట్టిన దెబ్బ అలాంటిది. చైనాలో పుట్టినట్లుగా చెబుతున్న కరోనా వైరస్ ప్రపంచ వ్యాప్తంగా మనుషుల ప్రాణాలు తీస్తే ఆఫ్రికా స్వైన్ ఫ్లూ చైనాలోని పందులపై విరుచుకుపడింది. ఈ వైరస్ ఎంతలా దెబ్బ కొట్టిందంటే మాంసాహారులకు పంది మాంసమే దొరకకుండా పోయింది. డిమాండ్, సప్లైలో భారీ తేడా వచ్చేసింది. దీన్ని గుర్తించిన చైనా ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలకు దిగింది. వాటి ఫలితంగానే ఇలాంటి భారీ పిగ్ హోటళ్లు చైనాలోని చాలా ప్రాంతాల్లో వెలుస్తున్నాయి. వాస్తవానికి 2019 సంవత్సరానికి ముందుకు చైనాలో ఇలా బహుళ అతస్థుల్లో పిగ్ ఫామ్స్ ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధం. కానీ అవసరం ఇప్పుడు ఆ చట్టాన్నే రద్దు చేయించింది.

## అత్యంత విలాసవంతమైన మూన్ రిసార్ట్

ప్రపంచంలోనే అతి పెద్ద, అత్యంత విలాసవంతమైన మోడరన్ టూరిజం రిసార్ట్ ఇది. అల్ట్రా విలాసవంతమైన హోటల్‌గా పేరు గాంచుతున్న ఇది చంద్రుని ఉపరితలం ప్రతిరూపంగా ఉంటుంది. భూమిపైనే అంతరిక్ష అనుభూతిని పొందే విధంగా ఈ మూన్ రిసార్ట్‌ను తీర్చిదిద్దుతున్నారు. మూన్ అని పిలువబడే ఈ రిసార్ట్ ఒక గోళాకార ఉక్కు నిర్మాణాన్ని కలిగి ఉంటుంది. ఇందులో చంద్రుని మీద ఉన్నటువంటి అనుభూతి కలుగుతుం ది. పోడియం పైన ప్రపంచంలోని అతి పెద్ద గోళంతో 224 మీటర్ల ఎతైన నిర్మాణం కలిగి ఉంటుంది. ఈ గోళంలో 20 అంతస్థుల హోటల్‌లో చంద్రుని అనుభవంతో అగ్రస్థానంలో ఉంటుంది.



ఇది చంద్రుని ఉపరితలాన్ని అనుకరిస్తుంది. ఇది అత్యంత వివరంగా పనిచేసే చంద్ర కాలనీని కలిగి ఉన్న 10 ఎకరాల ప్రామాణికమైన చంద్రుని ఉపరితం కలిగి ఉంటుంది. ఉత్తర అమెరికా, యూరప్, మధ్య ప్రాచ్యం, ఆసియాలో ఒక రిసార్ట్‌ను నిర్మించాలనే లక్ష్యంతో వరల్డ్ రిసార్ట్స్ సంస్థను ఏర్పాటు చేశారు. తద్వారా ఈ రిసార్ట్‌ను నిర్మిస్తున్నారు. ఎన్నో విలాసవంతమైన వస్తువులకు, ప్రదేశాలకు నిలయమైన దుబాయ్‌లో ఏర్పాటు చేస్తున్న ఈ రిసార్ట్స్ ను ఏడాదికి 2.5 మిలియన్ మందికి పైగా గెస్ట్‌లు వస్తారని, అలాగే కోటి మందికి పైగా పర్యాటకులు సందర్శిస్తారని అంచనా. ఈ అరుదైన ప్రాజెక్టుకు సంబంధించి డెస్టినేషన్ రిసార్ట్ తరహాలో 5 బిలియన్ డాలర్లు (41,37,50,250 రూపాయలు) ఖర్చు చేసి దుబాయ్ ఓ మూన్ బిల్డింగ్‌ను రూపొందిస్తోంది. ఈ దశాబ్దం పూర్తయ్యేలోగా ఈ నిర్మాణం పూర్తి చేయాలనే పట్టుదలతో నిర్మాణం పనులు చేస్తున్నారు. కెనడాకు చెందిన ఓ ఆర్కిటెక్ కంపెనీ దీనిని నిర్మిస్తోంది. ఆతిథ్యం, వినోదం, ఆకర్షణలు, విద్య, సాంకేతికత, పర్యావరణం, అంతరిక్ష పర్యాటకం వంటి రంగాలలో మూన్ దుబాయ్ ఎమిరేట్ ఆర్థిక వ్యవస్థకు జోడిస్తుందని ఆ ఆర్కిటెక్ సంస్థ విశ్వసిస్తోంది. 48 నెలల్లో ఈ మూన్ రిసార్ట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టింది. దీని ఎత్తు 735 అడుగులు. ఈ రిసార్ట్‌లో స్పా, వెల్‌నెస్ సెక్షన్, నైట్ క్లబ్, ఈవెంట్ సెంటర్, గ్లోబల్ మీటింగ్ ప్లేస్, లాండ్, మూన్ షటల్ వంటి పలు ఎట్రాక్షన్స్ ఉంటాయి.

## ఈ రెస్టారెంట్‌లో ఫుడ్ బిల్లే రూ.1.36 కోట్లు

మనం ఏదైనా రెస్టారెంట్‌కు వెళ్లి ఫుల్‌గా తింటే బిల్లు ఎంత వస్తుంది? మహా అయితే వేల రూపాయల్లో రావచ్చు. లేదంటే ఫ్రెండ్స్ తో కలిసి రెస్టారెంట్‌లో పార్టీ చేసుకుని ఫుల్‌గా ఎంజాయ్ చేస్తే బిల్లు ఎంత రావచ్చు? మహా అయితే లక్షల రూపాయల్లో రావచ్చు. ఇది కామన్... ఇందులో పెద్దగా ఆశ్చర్యపోవాల్సిన పని లేదు. కానీ ఈ రెస్టారెంట్‌లో భోజనం చేస్తే వచ్చే బిల్లుకు ఎవరైనా మూర్ఛపోవాల్సిందే. ఇంతకీ ఇక్కడ బిల్లు ఎంత వస్తుందో తెలుసా అక్షరాలా 1 కోటి 36 లక్షల రూపాయలు. షాక్ అయ్యారా? మీకు నమ్మబుద్ధి కావడం లేదా? కానీ ఇది నిజమే. అబూదాబిలోని ఫేమస్ రెస్టారెంట్ 'సాల్ట్ బే'లో కస్టమర్లకు ఇంత బిల్లు రావడం సహజం. ఇక్కడికి వచ్చేవారు కోటీశ్వర్లు, లక్షాధికార్లు మాత్రమే వస్తారు. ఈ బిల్లును రెస్టారెంట్ ఓనర్, వరల్డ్ క్లాస్ ఫేమస్ చెఫ్ సుస్రత్ గోక్సే సోషల్ మీడియాలో సైతం పోస్ట్ చేశారు. దీనికి నాణ్యత ఎప్పుడూ ఖరీదైనది కాదు అనే క్యాప్షన్ కూడా జత చేశారు. దీంతో ఈ బిల్లు తాలూకు పోస్ట్ వైరల్ అయింది. ఇంతకీ ఇంత బిల్లు అవ్వడానికి కస్టమర్ ఏమైనా బంగారం ఆర్డర్ చేశారా అనే అనుమానం మీకు రావొచ్చు. అసలు సంగతి ఏమిటంటే సాల్ట్ బే రెస్టారెంట్‌లో వడ్డించే ఐటెమ్స్ చాలా కాస్ట్‌లీగా ఉంటాయి. అక్కడకు వచ్చే కస్టమర్లు ఆర్డరు చేసే వాటిలో చాలా ఖరీదైన పదార్థాలు సైతం ఉంటాయి. ఈ బిల్లుకు సంబంధించి కస్టమర్ ఇచ్చిన ఆర్డరులో ఐదు బాటిళ్ల పెట్రస్ ఉంది. దీని విలువ 72 లక్షల 13 వేల రూపాయలు. అలాగే 2009కి చెందిన మరో రెండు బాటిళ్ల పెట్రస్ కూడా ఉంది. దీని ఖరీదు 44 లక్షల 38 వేల రూపాయలు. ఇక బిల్లు తాలూకు వ్యాట్ (విలువ ఆధారిత పన్ను) 6 లక్షల 40 వేల రూపాయలు. ఇక ఇందులో 24 క్యారెట్ బంగారం కోటింగ్‌తో కూడిన ఓ ఐటెమ్ కూడా ఉంది. వీటితో పాటు ఇంకా కొన్ని ఖరీదైన ఫుడ్ ఐటెంలతో కలిసి బిల్లు మొత్తంగా 1 కోటి 36 లక్షల రూపాయలు అయింది. అంత బిల్లు అయినా సంబంధిత కస్టమర్



హ్యాపీగా పే చేసి వెళ్లారు. ఇటువంటి కోట్ల రూపాయల బిల్లులు ఈ రెస్టారెంట్‌లో సర్వసాధారణం. మామూలుగా అయితే ఈ రెస్టారెంట్‌లో బిల్లు లక్షల రూపాయల్లో ఉంటుంది. మరొకరు ఇక్కడ భోజనం చేయడం వల్ల 1800 పౌండ్లు అంటే 1 లక్ష 80 వేల రూపాయల బిల్లు అయింది. సాల్ట్ బే రెస్టారెంట్ వరల్డ్ క్లాస్ చెఫ్ సుస్రత్ గోక్సేది. మాంసాన్ని కట్ చేసే ప్రత్యేకమైన శైలితో పాటు, ఆహార పదార్థాలపై అతడు ఉప్పు వేసే ఓ వెరైటీ సిగ్నేచర్‌తో సుస్రత్ ఎంతో ఫేమస్ అయ్యారు. ప్రత్యేకమైన మేనరిజంతో గుర్తింపు పొందారు. ఈ టర్కిష్ చెఫ్‌కు ప్రస్తుతం ఏడు దేశాల్లో లగ్జరీ స్టీక్ హౌస్‌లు ఉన్నాయి.

**- సిహెచ్.వి.వి.రఘుబాబు**

కథ

# అమృతం

**అనిల్ ప్రసాద్‌లింగం**


"అలా కాదురా సాష్టాంగ పడవలె" అన్నాడు మాంత్రికుడు.

"మరింకెలా స్వామీ?" తల గోక్కుంటూ అడిగాడు తోటరాముడు.

"నేను చూపిస్తాను చూడరా"

"మనం గుడికెళ్లినప్పుడు నీతో చేయిస్తాను కదా, ఇలా చేతులు ముందుకు చాచి మొత్తం నేల మీద బోర్లా పడుకొని నమస్కారం పెట్టిస్తాను చూడూ.. అదన్నమాట సాష్టాంగ పడటమంటే" తన రెండు చేతులు జోడించి పైకెత్తి, ముందుకు వంగి మనవడికి చూపించింది రాధమ్మ.

"అమ్మా.. నువ్వలా ముందే చెప్పేస్తే వాడికి చూడాలనే ఆసక్తి పోతుంది. వాడంతట వాడు చూసి తెలుసుకోవాలి. కావాలంటే తరువాత మనం మొత్తం సినిమాని వాడి మాటల్లో చెప్పమని అడగొచ్చు. అప్పుడు కూడా వాడికి అర్థంకానివే మనం చెప్పాలి. అలా అయితేనే వాడి మెదడు చురుకవుతుంది. ఇదంతా ఒక విధానంలో జరగాలి, నీకర్థం కాదులే" పక్కన కుర్చీలో కూర్చున్న కొడుకు తన తల్లికి చెప్పాడు.



మనవడితో కలిసి సోఫాలో కూర్చొని, అతనికి చిరుతిండి తినిపిస్తున్న నాయనమ్మ ఆ మాటతో ఒక్క ఉదుటున లేచి తన గదిలోకెళ్లిపోయింది.

ఈ మధ్య తరచూ ఇవే మాటలు వినాల్సొస్తుంది తను..

"నీకు తెలీదులేమ్మా, నీకు అర్థంకాదులేమ్మా, కాలం మారిందమ్మా, ఇది ఇప్పటి విజ్ఞానమ్మా" అంటూ ప్రతీదానికీ తనను దెప్పి పొడుస్తున్నారు. తానేమీ చదువు లేనిది కాదు. డిగ్రీ చదివి ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేసింది. భర్త పోయాక కొడుకు తన దగ్గరుండమని తీసుకొచ్చుకున్నాడు. చుట్టూ ఎత్తయిన గోడలతో ప్రాంగణం లోపలే నడవడానికీ, ఈత కొట్టడానికీ, సైకిల్ తొక్కడానికీ, సినిమాలు చూసుకోడానికీ, ఆటలాడుకోడానికీ, వ్యాయామం చేసుకోడానికీ, కిరాణా దుకాణం వంటి సకల సౌకర్యాలూ 24 గంటలూ అందుబాటులో ఉండేలా అన్ని ఏర్పాట్లతో కూడిన ఆధునిక జీవన విధానమైన గేటెడ్ కమ్యూనిటీ అనబడే అపార్ట్‌మెంట్ సమూహంలోకొచ్చి పడింది.

కొడుకూ, కోడలిద్దరూ ఉద్యోగాలకి వెళ్లిపోతే మధ్యాహ్నం స్కూలు నుంచి ఇంటికొచ్చే మనవడి ఆలనా పాలనా చూసుకుంటూ ఉంటుంది.

ఇప్పుడు వాడే తన లోకం. తనకి తెలిసిన కథలూ, పద్యాలూ, లోకరీతులూ అన్నీ వాడికి నేర్పిస్తూ ఉంటుంది. వాటిని వాడెప్పు డన్నా తన తల్లిదండ్రుల ముందు వల్లె వస్తే సంతోషించడం మానేసి అలా కాదు, ఇలా కాదు, ఇప్పుడివెందుకు.. అంటూ నసుగుతు న్నారు. అయినా భరిస్తూ వచ్చింది. కానీ ఈ మధ్య వాళ్ల సణుగుడు కొంచెం ఎక్కువయిందని ఆమెకి తోస్తోంది.

...

ఫోను మోగింది. రాధమ్మ స్విచ్ నొక్కగానే పక్కనే జతచేసి ఉన్న చిన్న తెర మీద ప్రత్యక్షమైన కొడుకు "ఎవరొచ్చారమ్మా ఇంటికి?" అనడిగాడు.

"నీకెలా తెలిసిందిరా?" ఈవిడ పార్వతి గారని ఆ ఊళ్లో మీ మేనత్తవాళ్లు మొదటగా వీళ్లింట్లోనే అద్దెకుండేవాళ్లు. ఆ తరువాత సొంత ఇల్లు కొనుక్కొన్నారు. అప్పట్లో పరిచయం. మన అపార్ట్‌మెంట్‌లోనే నాలుగో టవర్సుల్లో ఆమె కొడుకు దగ్గరుంటున్నారట. రెండేళ్లు అవుతోందట ఇక్కడికొచ్చి. మనకెప్పుడూ కనపడలేదు కదా. ఇందాక నానీని తీసుకురావడానికి వెళ్తే పక్కనే పార్కులో తిరుగుతూ నన్ను చూసి వచ్చి పలకరించారు. వాళ్లబ్బాయిని కూడా మీకు పరిచయం చేస్తే, ఇక్కడ కాస్త తోడుంటారని, ఇల్లు చూపిద్దామని టీకి పిలిచాను. మేమొచ్చి కూర్చున్నాం, నీ ఫోనొచ్చింది. నానీ తన గదికెళ్లాడు" చెప్పుకుపోతోంది అమ్మ.

"అమ్మా! పరిస్థితులు ఎలా ఉన్నాయో నీకు తెలీదా? ఎవరికే రోగముందో.. అది అంటురోగమైతే.. మనకు తెలీదు కదమ్మా. చేతులు కాలాక ఆకులు పట్టుకుని ఏం లాభం? ఇలా ఎవరిని పడితే వాళ్లని ఇంట్లోకి తీసుకొస్తే ఎలా? రేపు పిల్లాడికేమన్నా అయితే? నీ వయసువాళ్లూ జాగ్రత్తగా ఉండాలని డాక్టర్లు చెప్తున్నారు కదా. అందుకే కదా మనం బయటకెక్కడికీ వెళ్లడం మానేసాం" నిష్టూరంగా మాటలాడటం మొదలెట్టాడు అబ్బాయి.

"రెండు టీకాలూ వేయించుకు న్నారటరా.. నేనడిగాను"

"అమ్మా, రోజురోజుకీ వైరస్ రూపాంతరం చెంది కొత్త కొత్త విధానాలతో విస్తరిస్తోంది. ఏవేవో పేర్లు చెప్తున్నారు. బయట మాట్లాడి వస్తే సరిపోయేది కదా" అసలు మాట్లాడనివ్వలేదు తల్లిని.

"కొంచెం టీ ఇచ్చి పంపించేస్తాను" వచ్చినావిడ పరిస్థితి తలచుకొని చెప్పింది రాధ.

ఇంతలో ఈ మాటలన్నీ విన్న అతిథి "లేదండీ రాధగారూ, ఈ టైంలో నేను టీ తాగను. నా గురించి మా కోడలు చూస్తుంటుంది. మళ్లీ కలుద్దాంలెండి, నేనుంటా" అని లేచి వెళ్లిపోయింది.

"ఆవిడ వింటుందని కాస్త ఆలోచించవేరా? అయినా నీకెలా తెలుసు ఇంటికెవరో వచ్చారని?"

"అమ్మా, ఇంట్లోని సీసీ కెమెరాలన్నీ మా మొబైల్ ఫోనులకి అనుసంధానించబడి ఉన్నాయి. నీ కోడలు చూసి చెప్పింది, నువు ఎవరినో ఇంట్లోకి తీసుకొచ్చావని".

.........

అంతా సౌకర్యవంతంగానే ఉన్నా చిన్నప్పుడు పల్లెటూరిలో, ఆ పైన ఓ మోస్తరు టౌనులో జీవనం సాగించిన రాధమ్మకు ఈ అయాచిత విలాసం ఎంతమాత్రం రుచించడం లేదు. ఫోనులో నమోదు చేస్తే వెంటనే వచ్చి పడే సరుకులు, తమ అపార్టుమెంటు చుట్టూ రేయింబవళ్లూ అణువణువూ పట్టిచ్చే సీసీ కెమెరాలు, తుడవడానికి, ఆవరణలో మొక్కలకి నీళ్లు పోసి, వాటిని ఇష్టారీతిన ఎదగనీకుండా ఏదో ఓ ఆకారంలో కత్తిరించి, ఎల్లప్పుడూ సంరక్షించడానికి లెక్కకి మించిన పనివాళ్లు, ఈ సర్వ కాల సర్వావస్థలలోని పర్యవేక్షిత, నియంత్రిత జీవనం తనకి పంజరంలో ఉన్నట్టుగా ఉండింది. అసలే ఊపిరాడటం బాధపడుతుంటే ఇంతలో అంటురోగమొచ్చి అడుగుతీసి అడుగు బయట పెట్టనీకుండా చేసింది.

ఇంకా ఉక్కిరిబిక్కిరి అయిపోయింది తను. అయినా ఎలాగో సర్దుకుంది. కానీ తనకేమీ తెలీదన్నట్టు కొడుకు ప్రతిదానికీ అడ్డు చెప్తుండడం మాత్రం ఆమె భరించలేకపోతోంది.

.........

బాగా ముసురు పట్టింది. ఈదురుగాలులు వీచాయి. చీకటి కమ్మేసింది. ఉరుములూ మెరుపులతో చినుకులు పడనారంభించాయి.

బాల్కనీలో మనవడితో కలిసి నిలబడి చేతులు చాచి చినుకులని ఒడిసిపట్టుకుంటూ ఆనందిస్తోంది మామ్మ.

ఏటవాలుగా కురుస్తున్న వానకి పూర్తిగా తడిసిపోయారిద్దరూ. కింద పారుతున్న నీళ్లు, చెట్ల ఆకుల మీది నుంచి రాలుతున్న చినుకులు, తడిచిన రెక్కలు విదిలిస్తున్న పక్షులు, మళ్లీ వెలుగులు నింపుకుంటున్న ఆకాశం వంటివి బుడతడికి వివరిస్తూ ఉండగా– కిందకొచ్చి ఆగింది భారీ నిచ్చెన యంత్రం.

అందులో ఎక్కి ఓ మనిషి పైకి తమ అంతస్తుకు చేరుకొని బాల్కనీ పిట్టగోడ దూకి లోపలికొచ్చి వారి క్షేమ సమాచారం అడిగి, విద్యుత్తు మీటరు ఉండే ప్రదేశానికి తనతో పాటు తెచ్చుకున్న వాకీ టాకీలో "ఎవరో ఫ్యూజు తీసేసారు సార్, అందుకే కరెంటు పోయింది. అలాగే ఎంసీబీ, జనరేటరు స్విచ్ కూడా ఆపేసారు. అందుకే లైటు వెలగలేదు. నేను మళ్లీ పెడుతున్నా. ఇదిగో పవరొచ్చేసింది" అని చెప్పాడు.

సాయంత్రం కొడుకొచ్చి నానా యాగీ చేసాడు.

"అసలివేం పిచ్చి పనులమ్మా, పిల్లాడిని వర్షంలో తడపడమేంటీ? రేపు వాడికేమన్నా జలుబు చేస్తే? ఫ్యూజు పీకేసి కరెంటు ఆర్పడమేంటి?" కోపంతో ఊగిపోతున్నాడు అబ్బాయి.

"అది కాదురా, ఈ ఇంట్లో బయట కాస్త చల్లబడితే వెంటనే లైట్ల వెలుగు పెరిగిపోతుంది. వాడికి కటిక చీకటి, మసక చీకటి, వర్షం వచ్చేముందు మేఘాలు కమ్ముకున్నప్పుడు మూసుకొచ్చే

"కొంచెం టీ ఇచ్చి పంపించేస్తాను" వచ్చినావిడ పరిస్థితి తలచుకొని చెప్పింది రాధ.
ఇంతలో ఈ మాటలన్నీ విన్న అతిథి "లేదండీ రాధగారూ, ఈ టైంలో నేను టీ తాగను. నా గురించి మా కోడలు చూస్తుంటుంది. మళ్లీ కలుద్దాంలెండి, నేనుంటా" అని లేచి వెళ్లిపోయింది.

చీకటీ.. ఇలా ఏ తేడాలూ తెలీడం లేదు. ఎంతసేపూ విద్యుత్తు దీపాల వెలుగు, అదీ బయటి వాతావరణానికి అనుగుణంగా ఎక్కువ వెలుగు పెరగడం, తగ్గడం.. ఇక వాడికి చీకటంటే ఎలా తెలుస్తుంది?" వివరించబోయింది తల్లి.

"అసలు వాడు చీకటిలో ఎందుకుంటాడండీ?" అడిగింది కోడలు.

"చీకటిలో ఉండాలని కాదమ్మా. భయం పోవాలని, వాడికి అలవాటు కావాలని" ఆమెను పూర్తి చెప్పనివ్వకుండానే అడ్డు పడ్డాడు తనయుడు.

"చాల్లే అమ్మా ఊరుకో. ఇదేమన్నా పల్లెటూరా కరెంటు పోవడానికి? అయినా లక్షలు పోసి ఇక్కడ కొనుక్కున్నదెందుకు? 24 గంటలూ పవర్ బ్యాక్ అప్ ఉంటుందనే కదా. నీది మరీ చాదస్తం. నువ్వు ఆపేసావని తెలీక నేను మెయింటెనెన్సు వాళ్లకి ఫోను చేసి తిట్టాను. వాళ్లు అత్యవసరంగా పరిగెత్తుకొచ్చారు. చేసావుగా.. ఇప్పుడు వాళ్లెంత గొడవ చేస్తారో. ఇప్పటి కాలం వేరమ్మా. నీకు అర్థం కావడం లేదు. నువ్వేమీ వాడిని తీర్చిదిద్దనవసరం లేదు. ఇప్పుడన్నింటికీ పద్ధతులున్నాయి. ఏదయినా అవసరం అయితే నేర్పడానికి కోచింగ్ సెంటర్లున్నాయి. నువ్వు చెప్పినట్టు వాడు జీవితంలో దేనికైనా భయపడితే ఆ భయాన్ని తొలగించడానికి, వాడికి ధైర్యం నూరిపోయడానికి ఎంతో మంది మానసిక వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఎప్పుడు ఏ సమస్య ఎదురైనా దానికి తగిన విధంగా పరిష్కారం దొరికే వీలిప్పుడుందమ్మా.


## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి.
కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080. sunmagvaartha@gmail.com

యోగ నేర్పడం దగ్గర నుంచీ, వంట, సంగీతం, చిత్రలేఖనం, చివరికి నేనిప్పుడు వెలగపెడుతున్న కంప్యూటర్ కోడింగ్, ఒకటేమిటి.. నువ్వు ఊహించలేనివన్నీ పిల్లలకీ, పెద్దలకీ నేర్పే ఆన్‌లైన్ యాప్‌లు వచ్చేసాయి. మనం చెయ్యాల్సిందేమీ లేదు, వాడికి అవన్నీ అందుబాటులో ఉంచడమే. అంతే.. వాడి జీవితాన్ని, భవిష్యత్తునీ వాడే తీర్చిదిద్దుకుంటాడు. ఒకవేళ ఎప్పుడన్నా, ఎక్కడన్నా ఎదురు దెబ్బలు తగిలి పడిపోతే అప్పుడా సమస్యను ఎలా ఎదుర్కోవాలో తెలుసుకుంటే చాలమ్మా. అంతేగానీ, ఇప్పటి నుంచే చీకటీ, వర్షంలో తడవడం, తెలీని వాళ్లతో మాటలాడటం.. వంటి అనవసరపు విషయాల గురించి వాడికెందుకు చెప్పడం?" అంటూ విసుక్కున్నాడు కొడుకు.



మారు మాట్లాడలేకపోయింది తల్లి. ఆ రోజు రాత్రి ఆమె ఒక నిర్ణయానికొచ్చింది.

...

"ఒరేయ్ బాబూ... కాదూ.. 'హలో బాబూ' అనాలట మా డైరెక్టరు చెబుతున్నాడు. సరే హలో బాబూ.. నీ కొడుకేరా నాకిప్పుడు నిర్దేశకుడు. నీకో ఉత్తరం రాద్దామని కాగితం, కలం పట్టుకుని కూర్చుంటే ఇప్పుడంతా వీడియోల యుగం, నీ బోటి ఉత్తరం ఎవరు చదువుతారని అన్నాడ్రా. మరి నాకు వీడియో తీయడం రాదంటే, తానే ఫోను పట్టుకుని తయారయ్యాడు.

నన్నిక్కడ కూర్చోమన్నాడు, ఇక్కడైతే నా మాటల ప్రతిధ్వనినిబట్టి నా మనఃస్థితిని అంచనా వేసి రంగులు మారుతుందట కదా.

నేను చెప్పేది నీకు సరిగ్గా వినిపించకున్నా, కనిపించకున్నా అంతా నీ కొడుకు తప్పే. అలాగే బాగా వస్తే అదీ వాడి గొప్పతనమే. కాబట్టి నువ్వు మెచ్చుకోవాలంటే సాయంత్రం ఇంటికొచ్చేటప్పుడు వాడికి నచ్చిన చాకొలెటు తీసుకురావాలని వాడే చెప్పమన్నాడు" అంటూ నవ్వేసింది.

"ఏం లేదురా, నేను ఊరు వెళుతున్నా మనింటికి, పెడర్థాలు వెదకమాకు. ఇక్కడ ఇమడలేకపోతున్నా. ప్రస్తుతం ఓపికుంది, నా పనులు నేనే చేసుకోగలను. అందుకే కొన్నాళ్లు నాకలవాటైన విధానంలో బతుకుదామని. కానీ కాలూ, చెయ్యి కదపలేక మంచాన పడ్డప్పుడు మాత్రం వచ్చేస్తాన్రోయ్. అప్పుడు నీకూ, నీ పెళ్లానికి నన్ను భరించక తప్పదు.

నువ్వు కోట్లు పోసి కొన్న ఈ ఇంట్లోని సకల సౌకర్యాలు అప్పుడనుభవిస్తాను. కూర్చున్న చోటినుంచి లేవకుండా నోటిమాటతో తలుపు వెయ్యడం, తియ్యడం. వచ్చిందదెవరో తెలుసుకుని, ఇష్టమైతేనే లోనికి అనుమతివ్వడం లేకపోతే గేటు బయటి నుంచే తిప్పి పంపడం, అసలు అతిథి అంటేనే తిథి, వార, నక్షత్రాలు చూసుకోకుండా వచ్చి పడేవారని అర్థం. ఆ మౌలిక సూత్రాన్నే విస్మరించి, నువ్వెక్కడున్నా నీ చేతిలోని మొబైల్‌లో చూసి నీకిష్టమైతే రానిస్తావు, లేకపోతే వెనక్కి పంపేస్తావు. ఇదెక్కడి ఘోరమో. దెప్పి పొడుస్తున్నాననుకోకు. నాకు నచ్చడం లేదంటే. గాలి వెలుతురుని కూడా నియంత్రణలో పెట్టుకోవడమేంట్రా మరీనూ.

పిల్లాడిని కొట్టంలో పడెయ్యమనలేదు, వాడికి వాతావరణ తీరుతెన్నులు చూపిద్దామనుకున్నా. అది బెడిసికొట్టింది. కాస్త ఎండ తగిలితేనే కదా వాడికి నీడ విలువ తెలిసేది. చీకటినెరిగితేనే వెలుగుని ఆస్వాదిస్తాడనేది నా అభిప్రాయం. నీకది తప్పుగా తోస్తోంది కదూ! పర్లేదు.. ఇదేనేమో తరాల అంతరం అంటే.

మా మామగారు, అదే మీ తాతగారు ఊళ్లో పెద్ద మోతుబరి. ఆయన బ్యాంకు కార్యకలాపాలకి చెక్కుబుక్కు వాడేవారు. ఆయన చరమాంకంలో ఏటిఎం మెషిన్లు వచ్చేశాయి. వాటిని వాడడం ఆయనకు పెద్ద తలనొప్పిగా ఉండేది. కాబట్టి అవసరమైనప్పుడల్లా బ్యాంకుకు స్వయంగా వెళ్లి పని చేసుకొనేవారు. సెలవురోజులు, సమయం మించిపోవడం వంటి ఇబ్బందులు ఎదురైనప్పుడు మీ నాన్న ఆయన్ని ఏటిఎం మెషిన్ వాడమని తెగపోరు పెట్టేవారు. కానీ మీ తాతగారు ఓపిక చేసుకొని వెళ్లి డబ్బు తెచ్చుకునేవారు.

ఓసారి మేమందరం ఏదో ఊరెళ్లాం. మీ నాన్న ఏటీఎం కార్డు తీసుకొచ్చారు కానీ అక్కడున్న 2,3 బ్యాంకుల మెషిన్లు ఎందుకనో పని చెయ్యలేదు. అప్పుడు మీ తాతగారు జేబులో నుంచి రొక్కం తీసిచ్చారు. అప్పటినుండి మీ నాన్నగారూ చేతిలో కొంత క్యాష్ ఉంచుకోవడం మొదలెట్టారు. ఇలా పాత సాంప్రదాయాలని కొత్త సౌకర్యాలతో కలుపుకొనిపోయామేగానీ 'నీకేం తెలుసని' మా ముందు తరాన్ని మేం తృణీకరించలేదు. చెప్పొచ్చేదేమంటే ఇప్పుడు ఇక్కడి పద్ధతులు నాకు అసలు సంతృప్తినివ్వడం లేదు. ప్రతీది కాళ్లదగ్గరకొచ్చి పడటం, కూర్చున్న చోటునుంచే అన్నింటినీ నియంత్రించడం, మనుషులతో మాటా మంతీ లేకుండా యాంత్రికంగా బతకడం నాతో కాదు. అందుకే వెళుతున్నా.

ఉత్తరం అయితే నేను చెప్పాలనుకున్నది మరింత స్పష్టంగా చెప్పగలిగేదాన్నేమో. మాట్లాడాలంటే కొంచెం తడుముకోవాల్సి వస్తోంది. నీకు అర్థం కావాలనేదే నా ఉద్దేశం. మనకు మనస్పర్థలు రాకూడదు. పొగరుతో వెళ్లిపోయిందని రేపు నువ్వూ, కోడలు నన్ను నా మనవడితో కలవనివ్వకపోతే నేను చాలా బాధపడాలి.

అందుకే...... మరిక ఉంటానే...

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి.

రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

sunmagvaartha@gmail.com

హా....బాయ్ అనాలంట, మా డైరెక్టరు చెబుతున్నాడు. సరే.. అయితే బై" అని ముగించింది.

.........

అసురసంధ్యా సమయంలో రాధమ్మ దీపాలు వెలిగిస్తుండగా మోటారు సైకిలొకటొచ్చి ఇంటి ముందాగింది.

"బాగున్నారమ్మా? కొడుకు దగ్గరకెళ్లిపోయారు కదా. ఎప్పుడొచ్చారు? మీకో ఉత్తరమొచ్చింది. సన్నాసి ఎవడోగానీ స్టాంపులు అతికించకుండా పడేసాడు. మీకోసారి చూపిద్దామని తెచ్చాను" అంటూ ఇచ్చాడు పోస్టుమేన్.

"ఇదేంటి? ఈ టైంలో?" అడిగింది పెద్దావిడ.

"మధ్యాహ్నం ఎండలో తిరగలేకపోతున్నానమ్మా. అందుకే చల్లబడ్డాక తీసుకొచ్చాను. అయినా ఇప్పుడు ఉత్తరాలెవరు రాస్తున్నారమ్మా? అంతా సెల్‌ఫోనులమయం కదా. వారానికోసారి తిరిగితే సరిపోతుంది. ఏదైనా అర్జెంటయితే మాత్రం వెంటనే ఇచ్చేస్తానమ్మో" వివరణిచ్చుకున్నాడు వచ్చినవాడు.

"బండిమీదేకదయ్యా.. లోపలున్నది అవసరమైన విషయమో కాదో నీకెలా తెలుస్తుంది? సరేలే.. సమయానికొచ్చావు. కాస్త టీ తాగిపోదువుగానీ కూర్చో"మని ఆరుబయట సన్నజాజి పందిరికింద కుర్చీ వేసి వెళ్లి, రెండు కప్పులలో టీ తీసుకొచ్చి అప్పుడు ఉత్తరమెక్కడి నుంచి వచ్చిందో చూసుకుని ఆశ్చర్యపోయి తనలో తానే నవ్వుకుంటూ "ఎంత ఫైను?" అని అడిగింది.

.........

"అమ్మా...!

షాకయ్యావా? నాకు నువ్వు వీడియో పంపించావు కదా.. అందుకేనేమో నీకు ఉత్తరం రాస్తున్నాను. చాలా ఏళ్ల తరువాత రాస్తున్నాను కదా తప్పులుంటే మన్నించు. ఇంతకూ నువ్వు బాగున్నావా? ఏది ముందు అడగాలో, ఏది తరువాత రాయాలో మర్చిపోయాను. పర్లేదులే.. మా అమ్మకే కదా అనే ధైర్యంతో పంపిస్తున్నా. నాన్నగారు అంటుండేవారు కదా, ఉత్తరం తప్పనిసరిగా చేరాలంటే దానికి స్టాంపులు అతికించకూడదని. అలాగైతేనే ఫైను వసూలు చెయ్యడానికి పోస్టుమ్యాను వెదుక్కుంటూ వస్తాడని అనేవాళ్లు కదా. అందుకే నేను స్టాంపులు పెట్టలేదు. ఈ ఉత్తరం నీకు తప్పక చేరుతుందని ఆశిస్తున్నాను.

ముఖ్యంగా నీకో విషయం చెప్పాలి. మొన్న నీ కోడలు అంటువ్యాధికి గురయ్యింది. కంగారుపడకు.. ఇప్పుడు బాగానే ఉందిలే. ఇంట్లోనే ఉంటున్నాం గానీ ఎలా సోకిందో మరి. ముందు కొంచెం నలతగా వుందంది. కాస్త జ్వరం వచ్చింది. ఎందుకన్నా మంచిదని ఓ గదిలోకెళ్లి తలుపు పెట్టుకుంది. ఇక అప్పుడు మొదలయ్యింది ఒకటే దగ్గు. నేను డాక్టర్ని ఫోనులో సంప్రదించాను. పరీక్షలు చేయించి రిపోర్టు పంపిస్తే వైద్యం మొదలు పెడతానన్నాడు. ఈ లోపు వాడుకొమ్మని కొన్ని మందులు రాసి పంపించాడు. ఆ మందులు తీసుకురావడానికిగానీ, పరీక్షలకెళ్లడానికిగానీ లాక్‌డౌన్‌లోని సడలింపు ఆ రోజుకి మించిపోయింది. మళ్లీ తర్వాతి ఉదయం వరకు వేచి ఉండాల్సిందే. ఎటూ తోచక నిస్సహాయంగా చూస్తుండిపోయాను.

"బాగున్నారమ్మా? కొడుకు దగ్గరకెళ్లిపోయారు కదా. ఎప్పుడొచ్చారు? మీకో ఉత్తరమొచ్చింది. సన్నాసి ఎవడోగానీ స్టాంపులు అతికించకుండా పడేసాడు. మీకోసారి చూపిద్దామని తెచ్చాను" అంటూ ఇచ్చాడు పోస్టుమేన్.

అప్పుడు నీ మనవడు వంటింట్లో నుంచి కరక్కాయ తీసుకొచ్చి నోట్లో పెట్టుకొమ్మని వాళ్ల అమ్మకి గదిలోకిచ్చాడు.

ఊపిరి సలపని దగ్గు కాసేపటికి తెరపిచ్చింది. అంతేకాదు, ఆ వేళ నుండి మిరియాల కషాయం కాచి తనకి పంపించేవాడు. డాక్టర్‌కి చెబితే ఆమె త్వరగా కోలుకోడానికి ముఖ్య కారణం అవేనని మెచ్చుకున్నాడు.

నా భార్య వ్యాధి తగ్గాక తన కొడుకుని హత్తుకొని ఒకటే ముద్దులనుకో. కానీ మా ఇద్దరికీ తెలుసు.. వాడి తెలివికి కారణం నువ్వని. అసలింట్లో కరక్కాయ ఉందనిగానీ అది దగ్గు తగ్గడానికి ఉపయోగపడుతుందనిగానీ నాకు తెలీదు. తండ్రి కొడుకుని మెచ్చుకోకూడదం టారుగానీ వాడు ఆ రోజు చూపించిన సమయస్ఫూర్తిని గురించి ఎంత చెప్పినా తక్కువేనమ్మా.

అవసరమైనప్పుడు అన్నీ అంతర్జాలంలో లభ్యమవుతాయని ఇన్ని రోజులు అనుకున్నాం. కానీ అనంతమైన జ్ఞాన భాండాగారం మనింట్లోనే ఉందని గ్రహించలేకపోయాం. నాకూ, నా భార్యకూ నీ విలువ తెలిసొచ్చిందమ్మా. అందుకే వచ్చే వారం పరీక్షలైన వెంటనే నీ మనవడిని ఒక్కడినే బస్సు ఎక్కించి మన ఊరుకి.. నీ దగ్గరికి పంపిస్తాను. బస్సు టైము నీకు చెబుతాను. నువ్వు అక్కడ వాడిని దించుకో. నీతో ఉంటే వాడింకా ఎంతో జ్ఞానాన్ని, మనోధైర్యాన్ని, సామాజిక పరిస్థితులని ఆకళింపు చేసుకుంటాడు.

(పి.ఎస్: నేను మరీ మారిపోయి వాడిని సొంతం ఒంటరిగా బస్సెక్కించేస్తా ననుకోకు. డ్రైవరుకి చెప్పటమే కాదు, వాడి చేతికున్న జిపిఎస్ వాచ్ ద్వారా వాడి ప్రతీ కదలికనీ నిరంతరం గమనిస్తూనే ఉంటా, మనిల్లు చేరేవరకు).

ఇక నువ్వు మంచాన పడ్డప్పుడు మా అవసరం నీకుంటుందేమోగానీ, ఇప్పుడు, ఎల్లప్పుడూ నీ అవసరం మాకు ఉంటుందమ్మా. చెప్పాగా.. మేం నీ ఉనికిని, కొండంత అండని గుర్తెరిగాం. నీ కోడలొచ్చి నీతో మాట్లాడుద్దిలే. ఇక నీకు ఎదురు చెప్పం. మాతో ఉంటూ, వెనకుండి మమ్మల్ని నడిపించు చాలు. అలాగే నా కొడుక్కి మన ప్రాచీన సంప్రదాయ జ్ఞాన పునాది వెయ్యి. ఆధునిక పోకడలు నేను నేర్పిస్తాను. తద్వారా వాడొక బలమైన వ్యక్తిత్వం గల మంచి మనిషిగా ఎదిగి, సమాజానికి ఉపయోగపడితే మన కుటుంబానికీ, దేశానికీ పేరు తీసుకొస్తాడు.

అది సరే, అందరికీ ఏదో తెలిసినట్టు కరక్కాయ వాడమని సలహా ఇస్తున్నాను కానీ వాళ్లు 'అదెక్కడ దొరుకుంది?' అని అడుగుతుంటే చెప్పలేకపోతున్నా. కాస్త చెప్పావంటే పుణ్యముంటుంది నీకు. పోనీ మన ఊరి నుండి నువ్వు తీసుకొస్తే అవసరమున్నవారికి ఇద్దాం. ఇకపై నువ్వెలాగంటే అలాగే. నేను నీకు చెప్పాలనుకున్నవన్నీ వరుసగా గుర్తు పెట్టుకొని రాసాను. ఇక ఉంటాను. త్వరలోనే వచ్చి నిన్ను కలుస్తాం"

ఇట్లు.. నీ కుమారుడు" అని ముగించాడు.

.........

వ్యాకరణరీత్యా గందరగోళంగా ఉన్న లేఖని చూసి కోపమొచ్చినా తన కొడుకు భావ వ్యక్తీకరణ మీద పెట్టిన దృష్టికి తనలో తానే మెచ్చుకొని, ఆ కాగితాన్ని గుండెలకు హత్తుకొని, తనకీ వయసులో ఎంతో అవసరమైన స్వాంతన కలగచేసి నందుకు భగవంతునికి ధన్యవాదాలు తెలియజేసుకుంది రాధమ్మ.

ఈ మట్టిలో
స్వేచ్ఛా వాయువులు వీచినప్పుడు
కన్న కలలు ఫలించే కాలంలో
అమృత మహోత్సవ వేళ
రంగుల హరివిల్లు పూసింది నింగి
ఆనందపుటంచుల తీరం తాకిన

# అద్భుత మహోత్సవ వేళ




అలలు సముద్రం
నా జాతిది/ సత్యం కలిసి బతికిన జీవగుణం
ఎత్తిన తల దించని ఘన చరిత్రతో
ధరిత్రికే/ నాగరికత నేర్పిన సంస్కృతీ నేలది
మనిషి ఓరిమి, పరహితాన్ని
పెంచిన పరంపర భారతావనిది
ఓ నడుస్తున్న నది/ కురిసిన అమృతం నింగిని తాకింది
75 ఏండ్ల స్వాతంత్ర్య సంబరం అవనిపై
అదే అమృతోత్సవ గీతికి పునాది
ఆనాటి / సుదీర్ఘ కాల గాయాల రక్త తర్పణం
వీరుల త్యాగ ఫలం గంగా ప్రవాహం
ప్రజలంతా పోరాడిన ఫలితం ఇది./
ఉచ్ఛ్వాస నిశ్వాస గాలి స్వతంత్రంగా
భారతజాతి గుండెలో సజీవం
దేశాన్ని ప్రేమించు, మనిషిగా బతుకు
మట్టిని ప్రేమించు దేశభక్తితో/వెలుగు దేశ సేవలో మహాత్మగా..

**- డా॥ టి.రాధాకృష్ణమాచార్యులు**

---

ఒక అపరిచితం
అంతరాళాన్ని తరచి
ఎక్కడో దూరాన్ని/
సన్నిహితంగా
కాలం చుట్టుకొచ్చింది!
కిటికీలోంచి/ వర్షపు
బిందువులు/ సాక్షిగా ఒక
ఊహా చిత్రాన్ని తెచ్చాయి!
గుప్పిట విప్పి/ ఒక కథను
తీసుకెళ్లిపోయింది!
పక్కకి ఒత్తిగిలి
నెమలి రెక్కల మాటున
వెచ్చగా నిద్దురపోయింది
నా కల..!/ ఇంత క్షణికమా
ఐతే ఇది కలే!/ కాలాన్ని
స్థలంలో/ స్థలాన్ని దూరంలో
దూరాన్ని వేగంలో
జీవితాన్ని అసంబద్ధతలో

# నెమలి రెక్కల కల!




చెప్పింది/ నల్లటి వానాకాలం
సన్నటి కాలువలో/ ఆ
జల్లులతో పాటు/ కాస్త
పరిచయాన్ని కూడా
కాగితం పడవపై
కుదించేస్తుంది./ ఒక జడ
స్థబ్ధతను/ నింపేస్తుంది!
జ్ఞాపకాలకు ఊపిరిని
పోస్తుంది.

**- రఘు వగ్గు**

# గిజిగాడికి కోపమొచ్చింది!

గిజిగాడికి కోపమొచ్చింది
అడివిపూల చెట్టు చిన్నబోయింది!!
జొన్నచేనులో చిట్టిపిట్టల సవ్వడి లేక..
ఏటి గట్టున వెన్నెల మడుగుల వెల వెల పోతుంటే..
తాటితోపులో అల్లరుల అలజడులు..
కొత్తగా నేర్చిన నాగరికత వెంట పరుగులు తీస్తుంటే..
గిజిగాడికి కోపం వచ్చింది..
అడివిపూల చెట్టు చిన్నబోయింది!
నీలి మేఘాలు నెవ్వెరపోతూ నిలవలేక
పారిపోతుంటే
రాలిపోతున్న చివురులతో నిస్సహాయంగా
నిలుచున్న పసుపుపూల చెట్టు చూసి
గిజిగాడికి కోపమొచ్చింది..
అడివిపూల చెట్టు చిన్నబోయింది!
ఊరు గరిక పచ్చని పైరుచీరను జారవిడిచి
పట్నపు నాగరికతకు తాకట్టుగా మారుతుంటే..
మంచు పల్లకిలో దాచుకున్న
అక్షరాల పల్లె గీతికలన్నీ
కాల గర్భంలో జ్ఞాపకాల జాబితాలుగా
మిగిలిపోతుంటే..
గిజిగాడికి కోపమొచ్చింది..
మరో పల్లెకి పారిపోయింది..
ఊరంతా చిన్నబోయింది.

**- సురేఖా భాస్కర్**



# గోమఠేశ్వరుడు కొలువున్న శ్రావణబెళగొళ

## షేక్ అబ్దుల్ హాకీం జాని

**ప్రపంచంలోని** అతిపెద్ద ఏకశిలా విగ్రహాల్లో ఒకటి జైన మతాచార్యుడైన శ్రీ గోమఠేశ్వరుడి విగ్రహం. ఈ విగ్రహాన్ని కన్నడ ప్రజలు గోమఠేశ్వరుడని పిలిస్తే, జైనులు బాహుబలిగా కొలుస్తారు. కర్ణాటకలోని బెంగళూరు మహా నగరానికి 145 కి.మీ. దూరంలో నెలకొని వున్న హాసన్ జిల్లా చెన్నరాయణ తాలూకాలో శ్రావణబెళగొళ అనే చిన్న పట్టణం ఉంది. చంద్రగిరి, ఇంద్రగిరి అనే రెండు కొండల నడుమ ఇది నెలకొని ఉంది. పెద్ద కొండ అయిన ఇంద్రగిరి కొండశిఖరంపై 57 అడుగుల శ్రీగోమఠేశ్వరుని నిలువెత్తు విగ్రహం ఉంది. ఈ కొండనే దొడ్డబెట్టు అని పిలుస్తారు. జైనుల దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన శ్రావణబెళగొళను, వెళ్గొళ, దేవర బెళగొళ, శ్వేత సరోవర, ధవళ సరోవర, గౌతమపుర అనే పేర్లతో పిలిచేవారని శాసనాలు చెపుతున్నాయి. రెండు కొండల మధ్యన ఉన్న అందమైన పట్టణం శ్రావణ బెళగొళ. కర్ణాటకలోని హాసన్ జిల్లా చెన్నరాయ పట్టణానికి ఎనిమిది మైళ్ల దూరంలో ఉంది. ఈ ప్రదేశంలో గోమఠేశ్వర విగ్రహం మాత్రమే కాకుండా శ్రావణ బెళగొళకు సంబంధించిన మిగిలిన ప్రదేశమంతా జైన మతానికి సంబంధించిన విగ్రహాలతోను, జైన తీర్థంకరులకు చెందిన అనేక విగ్రహాలతో నిండి ఉంటుంది.

### పేరు వెనుక కథ

'శ్రావణ బెళగొళ'కు ఆ పేరు రావటానికి వెనుక ఓ చక్కటి కథ ప్రచారంలో ఉంది. 'బెళ' అనే కన్నడ పదానికి 'తెల్ల తామరలు' అని అర్థం. 'గొళ' అంటే కొలను. 'తెల్లని తామరపువ్వులతో నిండిన చక్కని కొలను' ఆ ఊళ్లో ఉంది. కాబట్టి దానిని 'బెళగొళ' అన్నారు. ఈ ఊరు చుట్టుపక్కల 'హళె బెళగొళ', 'వీడి బెళగొళ' అనే ఊళ్ళు ఉండటంవల్ల కూడా దీనికి 'బెళగొళ' అనే పేరు స్థిరపడిపోయింది. జైన భక్తులైన 'శ్రవణులు' ఈ ఊళ్లో ఎక్కువగా ఉండటం వల్ల 'శ్రవణ' అనే పదాన్ని ముందు చేర్చుకుని ఈ ఊరు 'శ్రావణ బెళగొళ' అయ్యిందని అంటారు. తెల్ల తామరలతో నిండిన చక్కని పుష్కరిణే కాక 'ఇంద్రగిరి, చంద్రగిరి' అనే రెండు కొండలు కూడా ఈ ఊళ్లో ఉన్నాయి. ఇంద్రగిరినే 'పెద్దమల' అనీ, చంద్ర గిరిని 'చిన్నమల' అని కూడా అంటారు.




### విగ్రహ ప్రతిష్ఠలో భిన్నాభిప్రాయాలు

శ్రావణ బెళగొళ గిరిపై కొలువుదీరిన బాహుబలి విగ్రహాన్ని గంగరాజైన రెండవ రాజ మల్లన్న మంత్రి, దండనాయకునిగా వున్న చాముండరాయ అనే వ్యక్తి ద్వారా క్రీ.శ.981లో నిర్మించబడింది. శ్రావణ బెళగొళలో గోమఠేశ్వరుని విగ్రహం పాదాల దగ్గర ఉన్న శాసనాలు ఆ విగ్రహాన్ని, చుట్టూ ఉన్న కట్టడాలను ఎవరు నిర్మించారో తెలియజేస్తున్నాయి. అయితే శాసనంలో పేర్కొన్న తేదీ, సంవత్సర నిర్ణయంలో చరిత్రకారుల మధ్య ఏకాభిప్రాయం లేదు. అందుకే కొందరు 981 సంవత్సరంలో ప్రతిష్ఠించారంటే; మరికొందరు 983 అంటున్నారు. అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్నప్పుడు ఏకశిలతో చెక్కబడిన నగ్నమూర్తి బాహుబలి విగ్రహం ఒక అద్భుతమైన కళాకృతి చాముండరాయని చేత క్రీ.శ.980-984వ సంవత్సరాల మధ్య కాలంలో ప్రతిష్ఠించినట్లు పేర్కొన్నారు. మరో శాసనంలో విగ్రహంచుట్టూ ఉన్న కట్టడాలను గంగరాజు నిర్మించినట్లు ఉంది.

### ఇంద్రగిరిపై బాహుబలి

చాముండరాయుని గొమ్మట అని పిలుస్తున్నందున ఆయనచే నిర్మించినందున ఈ విగ్రహాన్ని గోమఠేశ్వర అని పిలుస్తారు. 470 అడుగుల ఎత్తుగల ఇంద్రగిరిపై 57 అడుగుల గోమఠేశ్వరుని ఏకశిలా విగ్రహం నెల కొల్పబడింది. రెండవ కొండను చంద్ర గిరిబెట్ట అంటారు. ఈ విగ్రహం తల 6 అడుగులు, పాదం 9 అడుగులు, కాలి బొటనవేలు 2 అడుగులు,

భుజస్కంధం 26 అడుగులతో శిల్పీకరించారు. సర్వసంగ పరిత్యాగి అయిన జైన మతాచార్యుడు గోమతేశ్వరుడు నగ్నంగా ఆజానుబాహుడిలా కనిపిస్తాడు. గోమతేశ్వరుణ్ణి బాహుబలి అని కూడా పిలుస్తారు. జైన, విష్ణు పురాణాల ప్రకారం ఇక్ష్వాకు వంశానికి చెందిన వృషభనాథుడు, సునందల కుమారుడే ఈ బాహుబలి అని తెలుస్తుంది. బాహుబలి రాజ్యపాలన చేసినట్లు కొన్ని సారస్వత ఆధారాల వల్ల తెలుస్తుంది. నిజానికి అప్పట్లో జైనమతం పేరే లేదు. బాహుబలి తండ్రి స్థాపించిన మతాన్ని వృషభ ధర్మం పేరుతో పిలిచేవారు. బాహుబలి ఒక చారిత్రక పురుషుడని కానీ, పౌరాణిక పురుషుడనిగానీ కచ్చితంగా చెప్పలేం. ఒకప్పుడు తెలంగాణాలోని నిజామాబాద్ జిల్లాలో గల బోధన్ అటవీ ప్రాంతంలో అతి పెద్ద బాహుబలి విగ్రహం ఉండేదట. బాహుబలుడు రాజ్యం చేసింది తెలంగాణలోనే. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలో ఉన్న బోధన్‌ను పూర్వం పౌదన్యపురం అనీ, పోదనపురం అని పిలిచేవారు. ఇదే బాహుబలి రాజధాని. ఈ విషయాన్ని చెప్పే కొన్ని ఆధారాలు అందుబాట్లో ఉన్నాయి. పోదనపురం గురించి మహాభారతంలో కూడా ఉంది. అక్కడ జైన, బౌద్ధ, వైదిక మతాలు సమానంగా విలసిల్లాయి. అటువంటి పట్టణాన్ని బాహుబలుడు తన రాజధానిగా చేసుకున్నట్లు జైన గ్రంథాలు, విష్ణుపురాణం చెబుతున్నాయి. బోధన్‌లో అనేక జైన విగ్రహాలు, ఆలయాలు కనిపించడంతో బాహుబలుని రాజధానిగా నిజంగానే ఈ పట్టణం విలసిల్లిందేమోనని కొందరు చరిత్రకారులు అంటున్నారు. అప్పట్లో కర్ణాటక ప్రాంతాన్ని ఏలుతున్న పశ్చిమ గంగరాజు రాచమల్లువారి మంత్రి అయినా చాముండరాయుడు బోధన్‌లోని బాహుబలి విగ్రహాన్ని తిలకించి, స్ఫూర్తి పొంది అతి భారీ విగ్రహాన్ని శ్రావణ బెళగొళలోని ఇంద్రగిరిపై 57 అడుగుల ఎత్తులో జైన మహాశిల్పి అరిష్టనేమి ఆధ్వర్యంలో కొండరాయిని తొలిచి బాహుబలిని చెక్కి ప్రతిష్టించాడు. ఇంద్రగిరిపై ఉన్న ఈ విగ్రహం దాదాపు 10 కి.మీ. దూరం వరకు కనిపిస్తుంది. గోమతేశ్వరుని విగ్రహాన్ని చెక్కడంలో శిల్పి అరిష్టనేమి కనబరచిన నైపుణ్యం స్వయంగా చూడాల్సిందే. ధ్యానంలో బాహుబలి ముఖం ప్రశాంతతకు చిహ్నంగా, సర్వం త్యజించిన వ్యక్తి ముఖంలో కనిపించే నిర్వేదాన్ని చక్కగా మలిచారు. ధ్యానంలో శిలాగా మారిన మనిషి చుట్టూ చెట్లు అల్లుకుపోయినట్లు బాహుబలి భుజాల చుట్టూ చెట్ల తీగలు, ఆకులను అద్భుతంగా చెక్కారు. విగ్రహం కాలిగోళ్లు, వాటి చుట్టూ ఉండే చర్మంగీతలు సహజంగా ఉన్నట్లు చాలా స్పష్టంగా చెక్కారు. ఒక సాధారణ మనిషి విగ్రహం దగ్గర నిలబడితే బాహుబలి పాదం ఎత్తుకు సరిపోతారు. బోధన్‌లోని విగ్రహం స్ఫూర్తితో శ్రావణ బెళగొళలో బాహుబలి విగ్రహాన్ని రూపొందించారని చెబుతుంటారు. చాముండరాయలు తన తల్లి కోరిక మేరకు బాహుబలి తపోదీక్ష బూనిన పర్వతంపైనే ఏకశిలా విగ్రహం నిర్మించాడు.



చాముండరాయుడు నిర్మించిన విగ్రహాన్ని గోమతేశ్వరుడు అని కూడా పిలుస్తారు. అయితే బోధన్‌లోని విగ్రహం కాలగతిన శిథిలమైనట్లు తెలుస్తోంది. శ్రావణ బెళగొళలో చంద్రగిరి, ఇంద్రగిరి అనే రెండు ముఖ్యమైన కొండలు ఉన్నాయి. ఇంద్రగిరి శ్రావణ బెళగొళకు జీవనాడి వంటిది. 470 అడుగుల ఎత్తులో ఉన్న ఈ కొండపై 8 జైన ఆలయాలు ఉన్నాయి.

సముద్ర మట్టానికి 3 వేల అడుగుల ఎత్తున గల ఇంద్రగిరి అధిరోహించడానికి 614 మెట్లు ఉన్నాయి. ఈ మెట్ల ద్వారా వెళితే మహామండపాన్ని చేరుకోవచ్చు. దీని నుండి లోపలికి వెళితే బాహుబలి విగ్రహం కనిపిస్తుంది. శిఖరంపై ఉన్న అతి పెద్ద ఏకశిలా గోమతేశ్వరుని విగ్రహం 10 కి.మీ. వరకు కనిపించడం విశేషం. నిర్మలమైన ముఖారవిందం కలిగిన ఈ విగ్రహాన్ని బూడిదరంగు గల గట్టి గ్రానైట్ రాయిలో మలచబడింది. ఇంతటి గంభీర విగ్రహం చూపరులకు భయానకంగా కనిపించకపోవడం విశేషం. ప్రశాంత వదనం, నిర్మలం, నిశ్చలం తొణికిసలాడుతూ భక్తిభావన పెంచేలా కనిపిస్తుంది. సుందరమైన ముఖం, నిటారు ముక్కు, రింగులు తిరగిన కేశాలు, విగ్రహానికి పెనవేసుకున్నట్లు కనిపించే లతలు, ఆకులు నాటి శిల్పకారుల శిల్పకళా వైభవానికి ప్రతీకగా నిలుస్తుంది.

ఎటువంటి పైకప్పు లేకుండా వున్న బాహుబలి విగ్రహం పది శతాబ్దాలుగా చెక్కుచెదరకుండా నిలిచి వుంది. రెండవ మారసింహునికి, నాల్గవ రాచమల్లుకి మంత్రిగా ఉన్న చావుందరాయుడు ఈ విగ్రహాన్ని తయారు చేయించినట్లు చారిత్రక ఆధారాల వల్ల తెలుస్తుంది. 10వ శతాబ్దంలో దీన్ని చెక్కించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. బాహుబలికి సంబంధించిన కథ కూడా ప్రచారంలో ఉంది. మొదటి తీర్థంకరుడైన వీషభనాథునికి ఇద్దరు కుమారులు. వీరు భరతుడు, బాహుబలి. రాజ్యంకోసం బాహుబలి తన సోదరుడైన భరతుడితో ఘోరమైన యుద్ధం చేసి విజయం సాధించి రాజ్యం పొందాడు. ఆ తరువాత తాను చేసిన పనికి పశ్చాత్తాపపడి, రాజ్యాన్ని తన సోదరుడికి అప్పగించి సర్వస్వం త్యజించి తపస్విగా మారిపోయాడు. తపోదీక్షతోనే అసలైన మోక్షమార్గం, జ్ఞానమార్గమని గ్రహించిన బాహుబలి గోమతేశ్వరునిగా జైన మత ప్రచారం చేస్తూ తపోదీక్ష సాగించిన పర్వతంపైనే కైవల్యం పొందాడు. జైన మునుల్లో తొలి మోక్ష సాధకుడు గోమత్వేరుడు. 12వ శతాబ్దానికి చెందిన కన్న కవి జొర్పణ 'గొమ్మటస్తుతి' పేరుతో బాహుబలి



మహిమాన్విత విశేషాలను చక్కగా విశదీకరించాడు. గోమతేశ్వరుడు కేవలం భౌతికంగా కనిపించే సౌందర్యమూర్తి కాదు. మూర్తీభవించిన ఆత్మసౌందర్యం అంటూ కీర్తించాడు.

అంతటి మహిమాన్వితుడు కావడంచేత నిత్యాభిషేకాలు, అర్చనలు చేస్తున్నారు. ఈ విగ్రహ నిర్మాణం జరిగి వేయి సంవత్సరాలు దాటినట్లు అంచనా.

జైన మతాచార్యులు తమ దేవాలయాల్లో అర్చన చేసే మూలవిరాట్టులు 24 తీర్థంకరుల్లో ఎవరో ఒకరై ఉంటారు. అయితే బాహుబలి తీర్థంకరుడు కాదు. జైన తీర్థంకరులలో మొదటివాడు ఆదినాథుడు కాగా మహావీరుడు 24వ తీర్థంకరుడు. అయితే గోమతేశ్వరుడు తొలి మోక్షగామిగా భావించి జైనులు తీర్థంకరుల పట్ల చూపిన భక్తిశ్రద్ధలు, ఆరాధనా భావాలు బాహుబలి పట్ల కూడా ప్రదర్శిస్తారు.

క్రీ.శ.82వ సంవత్సరంలో జైనులు శ్వేతాంబరులు, దిగంబరులుగా చీలిపోయారు. తెల్లని వస్త్రాలు ధరించే వారు శ్వేతాంబరులు కాగా, సర్వం త్యజించామనే భావనతో ఎటువంటి వస్త్రం ధరించకుండా నగ్నంగా తిరిగేవారు దిగంబరులు. గోమతేశ్వరుడు దిగంబరుల కోవకు చెందినవాడు. క్రీ.పూ.2వ శతాబ్దంలోనే జైనమతం వ్యాప్తి చెందిన ఆధారాలున్నాయి. అటు కర్ణాటకలోని శ్రావణ బెళగొళతో పాటు ఇటు గుంటూరు జిల్లా భట్టిప్రోలు గ్రామంలో లభించిన శాసనాల వల్ల రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో నిర్మితమైన జైన దేవాలయాల నిర్మాణం వలన కూడా ఈ మత వ్యాప్తి గురించి తెలుస్తుంది.





**బాహుబలికి మహామస్తకాభిషేకం**

భారీ విగ్రహం నెలకొల్పడానికి 12 సంవత్సరాలు పట్టింది. 12 ఏళ్లకు ఒకసారి బాహుబలికి మహామస్తకాభిషేకం జరుపుతారు. మహామస్తకాభిషేకం జైన మతంలో ముఖ్యమైన పండుగ. 1398లో తొలి మహామస్తకాభిషేకం జరిపినట్లు తెలుస్తోంది. గోమతేశ్వరుని మహామస్తకాభిషేక సన్నివేశం ఒక అపూర్వ పర్వంగా చెప్పవచ్చు. మహామస్తకాభిషేకం సమయంలో దేశ, విదేశాల్లోని జైనులతో పాటు శాంతికాముకులు కూడా శ్రావణ బెళగొళ చేరతారు. మహామస్తకాభిషేకం సందర్భంగా కట్టెలతో విగ్రహం వెనుక వైపు తాత్కాలిక మంచె ఏర్పాటు చేస్తారు. జైన మత గురువులు, పండితులు ఈ మంచె ఎక్కి గోమతేశ్వరుని శిలా విగ్రహ తలపై నుండి 1008 బిందెలతో కూడిన సుగంధ ద్రవ్యాలతో నిండిన పవిత్ర జలాలతో ప్రతిరోజూ అభిషేక కార్యక్రమాన్ని బాహుబలి మూర్తికి అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. బాహుబలి విగ్రహం తెల్లని ఛాయలో ఉండటం వల్ల ఏ రంగు జలాలలో అభిషేకం చేస్తే ఆ ఛాయలో విగ్రహం



మనకు కనిపించి నయనానందం చేస్తుంది. సాధుపుంగవులు, మత గురువులు మంత్రోచ్చారణ చేస్తూ పాలు, పెరుగు, నెయ్యి, చక్కెర, బెల్లం, కుంకుమపూలు, బాదం, అరటిపండ్లు, బంగారం నాణేలు, వెండి నాణేలు, వెండి, పసుపు, పుష్పాలతో అభిషేకం గావిస్తారు. 12 ఏళ్లకు ఒకసారి జరిగే మహామస్తకాభిషేకం ఉత్సవం నేత్రపర్వంగా ఉంటుంది. ఈ ఉత్సవంలో కుల, మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొంటారు. దేశంలో ఉన్న దిగంబర జైనస్వాములు నలుమూలల నుంచి ఈ ఉత్సవంలో పాల్గొనటం విశేషంగా కనిపిస్తుంది. గతంలో 1981 ఫిబ్రవరిలో మహామస్తకాభిషేకం జరిగింది. ఆ తరువాత 1993 డిసెంబరు 19న జరిగింది. తరువాత మహామస్తకాభిషేకం 2006 ఫిబ్రవరిలో జరిగింది. మళ్లీ తిరిగి 2018 ఫిబ్రవరి 17 నుండి 25వ తేదీల వరకు మహామస్తకాభిషేకం జరిగింది. గతంలో జరిగిన మహామస్తకాభిషేకం ఒక ఎత్తు అయితే 2018లో జరిగిన మహామస్తకాభిషేకం మరో ఎత్తు అని చెప్పవచ్చు. ఎందుకంటే గతంలో జరిగిన కార్యక్రమాల్ని శ్రావణబెళగొళ వెళ్లినవారు మాత్రమే తిలకించేవారు. అయితే 1993లో ఢిల్లీ దూరదర్శన్‌వారు మహాస్తకాభిషేక కార్యక్రమాన్ని చిత్రీకరించి చూపించారు.

ప్రస్తుతం ప్రతి రాష్ట్రంలోనూ పెరిగిపోయిన శాటిలైట్ ప్రయివేటు టి.వి.ఛానళ్ల పుణ్యమా అని భారతదేశ ప్రజలు కాకుండా ఖండాంతరాల్లో ఉన్న విదేశీయులు సైతం ప్రత్యక్షంగా బాహుబలి మహామస్తకాభిషేకాన్ని తిలకించే అవకాశం ఉంది. మళ్లీ 2030లో గోమతేశ్వరుని మహామస్తకాభిషేకం చేస్తారు.



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



వారమంతా ఉత్సాహంగా గడుస్తుంది. క్రయ-విక్రయాలు లాభదాయకంగా ఉంటాయి. కుటుంబంలో ఐకమత్యం లోపిస్తుంది. ప్రారంభించిన పనులు వారాంతంలో పూర్తి చేస్తారు. ఉద్యోగులకు స్థాన చలన సూచనలున్నాయి. ధర్మ రక్షణకై పాటు పడతారు. తీర్థ యాత్రలు చేస్తారు. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తారు. ప్రముఖులతో పరిచయం.

## వృషభం



అనూహ్యంగా మొండి బకాయిలు వసూలవుతాయి. చిరు వ్యాపారులకు పోటీ ఉంటుంది. కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. అకారణంగా మానసిక ఆందోళనకు లోనవుతారు. వివాహాది శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. ఉద్యోగ ప్రయత్నం ముమ్మరం చేస్తారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి బాగుంటుంది.

## మిథునం



ఆలోచనల్లో స్థిరత్వం లోపిస్తుంది. చిరు వ్యాపారులకు బ్యాంకు రుణాలు మంజూరవుతాయి. పెట్టుబడులు లాభిస్తాయి. వృత్తి ఉద్యోగాల్లో వున్నవారికి సామాన్యంగా ఉంటుంది. కళాకారులు, క్రీడాకారులకు ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుంది. ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. హోల్‌సేల్ వ్యాపారులకు సామాన్యం.

## కర్కాటకం



శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. ఆరోగ్య, ఆహార సలహాలు-సూచనలు పాటించడం అత్యవసరం. దేశాంతర ప్రయాణం చేసే సూచనలున్నాయి. అన్ని వ్యవహారాల్లో ఆచితూచి వ్యవహరించడం చెప్పదగిన సూచన. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. పెట్టుబడులను వాయిదా వేయడం మంచిది. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. వాహన యోగం.

## సింహం



సామాన్యంగా ఉంటుంది. ఉద్యోగులకు పై అధికారుల ప్రశంసలు లభిస్తాయి. వృథా కాలక్షేపం మంచిది కాదు. ప్రతికూలతలు ఎదురైనా ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. ప్రభుత్వ సంబంధమైన పనులు వారాంతంలో పూర్తి అవుతాయి. విదేశాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ వార్తలు వింటారు. చర్చలు ఫలిస్తాయి.

## కన్య



క్రీడాకారులకు, కళాకారులకు సన్మాన యోగం. వృత్తి విద్యాకోర్సులు అభ్యసించిన వారికి ఆర్థికంగా బాగుంటుంది. తీర్థ యాత్రలు చేయాలన్న ఆలోచనలు ఫలిస్తాయి. కింది స్థాయి ఉద్యోగులతో మాట్లాడేటప్పుడు సంయమనంతో వ్యవహరించండి. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. అనాథాశ్రమాలకు మీ శక్తిమేరకు సహాయం చేస్తారు. వృథా ఖర్చులుంటాయి.

## తుల



వృత్తి వ్యాపారస్తులకు ఆశాజనకంగా ఉంటుంది. స్త్రీలకు శుభ యోగం. కోర్టు వ్యవహారాలు సానుకూలం. కుటుంబంలో మనస్పర్థలకు అవకాశం. ఆలోచనల్లో స్థిరత్వం లోపిస్తుంది. సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. గృహ రుణాలు మంజూరవుతాయి. విలాసవంతమైన జీవితం పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. విద్యారంగంలో పని చేసేవారికి బాగుంటుంది. చర్చలు వాయిదా.

## వృశ్చికం



అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. దేశాంతర ప్రయాణం చేస్తారు. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి వస్తుంది. ధర్మ రక్షణకై పాటుపడతారు. అదనపు ఆదాయ మార్గాలకై అన్వేషిస్తారు. శత్రువులు మిత్రులవుతారు. ఊహించని వార్తలు వింటారు. జీవిత భాగస్వామి ద్వారా స్థిరాస్తి కలిసొస్తుంది. వృత్తి కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. ఉద్యోగులకు సహోద్యోగులతో సఖ్యత ఏర్పడుతుంది.

## ధనుస్సు



శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు. ఉద్యోగులకు ఆకస్మిక బదిలీ సూచనలున్నాయి. ఏది జరిగినా మన మంచికే అన్న ధోరణి అలవడుతుంది. ఆదాయానికి మించిన ఖర్చులున్నా సమయోచితంగా వ్యవహరిస్తారు. లలిత కళల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తాయి. దుర్వ్యసనాలకు దూరంగా వుండాలని దృఢ నిశ్చయం చేసుకుంటారు. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు.

## మకరం



కుటుంబ సమస్యలు పెరుగుతాయి. వృత్తి విద్యా కోర్సుల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడే అవకాశాలున్నాయి. ఉద్యోగులకు స్థాన చలన సూచనలున్నాయి. మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. భూ తగాదాలు తీరి లబ్ధి పొందుతారు. వృథా ఖర్చులను నియంత్రించడంలో విఫలమవుతారు. సాహస నిర్ణయాలు తీసుకుంటారు.

## కుంభం



విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. గృహ రుణాలు తీర్చి ఊరట పొందుతారు. కుటుంబ గౌరవం ఇనుమడిస్తుంది. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. ఉద్యోగులకు పనివత్తిడి అధికంగా ఉంటుంది. వృథా కాలక్షేపం చేస్తారు. ఎదురు చూస్తున్న వర్తమానం వారాంతంలో అందుకుంటారు. విద్యార్థులు వృత్తి విద్యా కోర్సుల్లో చేరతారు.

## మీనం



సన్నిహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. శుభకార్య చర్చలు ఫలించే అవకాశాలున్నాయి. వృత్తి రంగాల్లో వున్నవారికి పోటీ ఏర్పడుతుంది. దుర్వ్యసనాలకు దూరంగా వుండాలని దృఢ నిశ్చయం చేసుకుంటారు. దేవాలయాలు సందర్శిస్తారు. ఆరోగ్య సలహాలు, సూచనలు తూచా తప్పకుండా పాటించండి. తాహతుకు మించిన రుణాలు చేయకపోవడం మంచిది. ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండండి.

# మౌన మహిమ

ఇద్దరు ప్రముఖ జ్ఞానులు కలిస్తే వారేం మాట్లాడుకుంటారు.. అది తెలుసుకోవాలంటే మీరు ఈ కథను చదవాలి.

షేక్ ఫరీద్ ఓ గొప్ప జ్ఞాని. ఆయన ఒక్కో ఊరూ పర్యటిస్తూ వస్తున్నారు. అలా ఆయన కాశీకి వెళ్లారు. ఆయనతో పాటు కొందరు శిష్యులు కూడా ఉన్నారు.

కబీరు కాశీలో ఉంటున్న విషయం ఆ శిష్యుల చెవిన పడింది. వెంటనే వారికి ఓ ఆశ కలిగింది.

షేక్ ఫరీద్, కబీరు కలుసుకుని మాట్లాడితే బాగుంటుందన్నదే ఆ ఆశ. ఇంతకీ ఎందుకు అలా ఆశించారంటే.. ఇద్దరినీ కలిపితే ఎన్నో గొప్ప తత్వాలు వినే అవకాశం ఉంటుందని వారనుకున్నారు. అందుకని వారిద్దరూ కలుసుకోవాలన్నది వారి ఆశ.

శిష్యులు తమ కోరికను గురువుగారితో చెప్పారు.

"సరే.. కబీరుని కలుద్దాం.. కానీ ఆయనతో మాట్లాడే విషయమై చెప్పడానికి ఏమీ లేదన్నారు".

"ఎందుకండీ? మీరు కబీరుతో ఏదీ మాట్లాడరా?" అని అడిగారు శిష్యులు.

"ఆయనతో మాట్లాడటానికి ఏమీ లేదు. ఎందుకంటే నాకు ఏం తెలుసో ఆయనకు తెలుసు. ఆయనకు ఏమి తెలుసో నాకు తెలుసు. అటువంటప్పుడు మేమిద్దరం మాట్లాడుకోవడానికి ఏముంటుంది?" అని అడిగాడు షేక్ ఫరీద్.

ఇక్కడ పరిస్థితి ఇదైతే–

ఇక కబీరు ఉన్న చోట..

ఫరీద్ కాశీకి వచ్చారన్న విషయం కబీరు శిష్యులకు తెలిసింది. అంతే.. ఆ వెంటనే వారు కూడా "మీరు షేక్ ఫరీదుని కలిసి మాట్లాడాలి" అని తమ గురువుగారిని అడిగారు.

అందుకు కబీరు "మేమిద్దరం కలుసుకుంటే ఇద్దరం గట్టిగా కౌగిలించుకుంటాం, ఆనందభాష్పాలు కార్చుకుంటాం. మాటల రూపేణా చెప్పుకోవడానికి మా మధ్య ఏమీ లేదు" అన్నారు.

అయినా ఈ ఇద్దరు పెద్దల శిష్యులు అలా అనుకోలేదు.

తమ గురువులిద్దరూ కలుసుకుంటే తప్పనిసరిగా ఏదో ఒకటి మాట్లాడతారు. తప్పనిసరిగా వారి మధ్య మాటలుంటాయి. ఏదో ఒకటి మాట్లాడకుండా ఉండరు. కనుక వీరిద్దరూ కలుసుకోవలసిందేనని వారి శిష్యుల కచ్చితాభిప్రాయం.

కబీరు ఫరీదుని తమ ఆశ్రమానికి ఆహ్వానించారు. ఆ ఊరి పొలిమేరకు వెళ్లి ఆయనను పిలుచుకువచ్చారు.

ఇద్దరూ కలుసుకున్నారు, ఒకరినొకరు కౌగిలించుకున్నారు. ఇద్దరూ చేతులు కలిపారు. చాలాసేపు నిల్చున్నారు.. ఆనందభాష్పాలు కారాయి.

కబీరు ఆశ్రమంలో ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు.

వారిద్దరూ ఏదో ఒకటి మాట్లాడుకుంటారని, ఆ మాటలు



వినాలని శిష్యులందరూ ఎదురు చూస్తున్నారు.

చాలాసేపు మౌనం చోటు చేసుకోవడంతో శిష్యులు వారిని మాట్లాడమని అడిగారు.

ఆ మాటకు ఇద్దరూ చిన్నగా నవ్వారు.. అంతేతప్ప మాట్లాడుకోలేదు.

ఓ రోజంతా ఇలాగే గడిచింది.

ఆ తర్వాత ఫరీద్, కబీరు దగ్గర వీడ్కోలు పొందారు.

"మీరెందుకు మాట్లాడలేదని?" కబీరుని శిష్యులు అడిగారు.

"మేమిద్దరం ఒకరికి ఒకరు చెప్పుకోవడానికి మాటలు లేవు. కానీ ఇద్దరం పరస్పరం అనుభూతి చెందాం. నేను ఏమనుకుంటున్నానో ఆయనకు తెలుసు. ఆయన ఏమనుకుంటున్నారో నాకు తెలుసు. ఇక అటువంటప్పుడు మా మధ్య మాటలెందుకు?" అని అడిగారు కబీరు.

ఫరీదుని కూడా ఆయన శిష్యులు "కబీరుతో ఎందుకు మాట్లాడలేదని?" అడిగితే ఆయన కూడా కబీరులాగే జవాబిచ్చారు.

అంతేకాదు, ఫరీదు ఇలా చెప్పారు..

"మా ఇద్దరిలో ఎవరు మాట్లాడటానికి పూనుకున్నా అది మూర్ఖత్వమే అవుతుందన్నారు.

దాంతో జ్ఞానులు ఇద్దరూ మాట్లాడుకుంటే ఎటువంటి స్పష్టత కలుగుతుందో అంతకన్నా ఎక్కువ స్పష్టతే కలిగిందా శిష్యులకు.

సత్యస్వరూపులు మాట్లాడుకోవలసింది ఏమీ ఉండదు. కానీ వారి మధ్య అనుభూతి చెందడం తప్ప మరొకటుండదు. కనుకే వారిద్దరూ ఒకరికొకరు కలుసుకున్నా మాట్లాడుకోలేదు. కేవలం చూపులతోనే ఒకరికొకరు చెప్పుకున్నారు, అర్థం చేసుకున్నారు.

అది అలా ఉండనిచ్చి, ప్రస్తుతానికి వద్దాం.

ఓ భార్యా భర్తా చాలా కాలం వేరువేరుగా ఉన్నారు. అనేక సంవత్సరాల తర్వాత వాళ్లు కలుసుకున్నారు. ఇద్దరు అలా కలుసుకున్న క్షణాన ఏదైనా మాట్లాడుకోవచ్చుగా! కానీ మాట్లాడుకోలేదు. ఇద్దరూ మౌనంగా ఉన్నారు. ఇద్దరూ ఒకరినొకరు చూసుకున్నారు. అంతే.

అప్పుడు ఒకరు ఆ భర్తను పక్కకు తీసుకుపోయి అడిగారిలా..

"చాలా కాలం తర్వాత మీరు కలుసుకున్నారు. మీరే మొదటగా మాటలు మొదలు పెట్టాల్సింది కదా!" అని అడిగారు.

అందుకు ఆ భర్త–

"ఇప్పటికే నేను నోరు తెరవడం వల్లేగా ఇంత కాలమూ ఇద్దరూ విడిపోయి వేర్వేరుగా ఉండాల్సి వచ్చింది. అందుకే నేను మాటలు మొదలు పెట్టకుండా ఒర్పు వహించానన్నాడు".

**- యామిజాల జగదీశ్**

తెలుగు సాహిత్యంలో, వెయ్యేళ్ల చరిత్రలో స్త్రీ కవయిత్రులు, మధ్య యుగంలోని భక్తి ఉద్యమంతో తప్ప శతాబ్దాల కాలభ్రమణంలో అత్యంత స్వల్పసంఖ్యలో, వేళ్ల మీద లెక్కించే సాహిత్య, చారిత్రక పరిణామాలు అనుభవించి ఎదుర్కొన్నారు. 13వ శతాబ్దంలో చానమ్మ, ప్రోలమ్మ, 16వ శతాబ్దంలో మొల్ల, 17వ శతాబ్దంలో రంగాజమ్మ, మధురవాణి, 18వ శతాబ్దంలో ముద్దుపళని, 19వ శతాబ్దంలో జానకమ్మ.. ఇలా అతి తక్కువగా మహిళలు తెర వెనుక కవయిత్రులుగా నిక్షిప్తమై వున్నారు. తెలుగు వాఙ్మయంలో ఎందరో ప్రతిభగల అజ్ఞాత కవయిత్రుల, రచనా కాలంగానీ, రచనలుగానీ వెలుగు చూడలేదు.

"ముదితల్ నేర్వగరాని విద్యగలదే ముద్దార నేర్పించినన్" అన్న సూక్తి అనుసరించి, పురుషాధిక్యత కారణంగా అవిద్య, శారీరక, రమణమ్మల సంపాదకత్వంలో హిందూ సుందరి పదిహేను యేళ్లు నడిచింది. 1927లో మద్రాస్ నుండి 'గృహలక్ష్మి'లో కనపర్తి వరలక్ష్మమ్మ శారదాలేఖలు నిర్వహించారు. మద్రాస్‌లోని క్రైస్తవ విద్యాభివర్ధనీ సమాజం 1909 నుండి 1934 వరకు 'వివేకవతి' పత్రికకు క్రైస్తవ మహిళలు సంపాదకులుగా వ్యవహరించారు. విదేశీ, భారతీయ క్రైస్తవ మహిళల 'అమ్మ, మిస్సమ్మ'ల కమిటీ ఆధ్వర్యంలో వివేకవతి ముచ్చటైన తెలుగు బైబిల్ భాషలో స్త్రీల రచనలకు ప్రాధాన్యం యిచ్చింది. క్రీస్తు బోధకుల సువార్త ద్వారా అవివేకపు చీకట్లో మగ్గుతున్న భారతీయులకు విద్యాభివృద్ధి క్రైస్తవ మహిళలు కల్పించాలని స్పష్టంగా ప్రకటించి మత ప్రచార పత్రికగా గుర్తింపు పొందింది. 1896లో చిలకమర్తి లక్ష్మీనరసింహం గారి చారిత్రక నవల హేమలత ధారావాహికంగా ప్రచురింపబడినట్టు తెలుస్తోంది. భండారు అచ్చమాంబ, దామెర్ల సుందరమ్మ, సీతమ్మ,

# తెలుగు సాహిత్య చరిత్రలో కవయిత్రులు

మానసిక అజ్ఞానం, కరుడుగట్టిన సామాజిక దురాచారాల కోరలలో చిక్కుకొన్న తెలుగు మహిళ భోగ్య వస్తువుగా, రాజాశ్రయాలలో కవితా శక్తి ప్రదర్శించిన కొందరి జాణల పేర్లు వెలుగు చూసాయి. జయంతి రామయ్య గ్రంథస్థం చేసిన 'ఆధునిక వాఙ్మయ వికాస వైఖరిలో, తంజావూరు యక్షగానీ వీధి నాటకాలలో, భామకలాపాలలో నాటి గణిక మహిళల కవితాశక్తి రాజాశ్రయ అధీనంగా కొన్ని పేర్లు స్పష్టమయ్యాయి. రంగాజమ్మ రచించిన 'మన్నారుదాస విలాసం'లో విజయరాఘవ నాయకుని కాలంలో, ప్రబంధ సాహిత్య రీతిలో ప్రౌఢలు మోహం, విరహంతో తమను అర్పించుకొనే జానిసత్వం వివరించబడింది. 1600-1631 కాలంలో తంజావూరు నాయక రాజులలో రఘునాథరాయలు కవి, సంగీతవేత్త, పలు కావ్య, యక్షగాన ప్రక్రియలలో రసవత్తరమైన సాహిత్యం సృష్టించినా రసికరాజుగా విలసిల్లాడు. ఆ కాలంలోనే శ్రీకృష్ణభక్తి కవిత్వం వేలంవెర్రిగా శృంగార సాహిత్యం వెల్లివిరిసింది. ముద్దుపళని రాధికా సాంత్వనం పౌరాణిక పాత్రలలో అశ్లీల వర్ణనల ఒక రాసక్రీడా రణరంగం. కవయిత్రులైన రామభద్రాంబ, మధురవాణి సంస్కృతాంధ్ర భాషలలో కవిత్వం అల్లిన జాణలు. శ్రీకృష్ణ దేవరాయల కాలంలో అష్టదిగ్గజాలలో మహిళ లేదు. నన్నయ, తిక్కన నాటి నుంచి శ్రీశ్రీ వరకు తెలుగు సాహిత్యంలో ఒక కవయిత్రి లేదా రచయిత్రి కనపడరు. అది మన దౌర్భాగ్యం.





సతీ సహగమనం, అతిబాల్య వివాహాలు, దేవదాసీ దురాచార వ్యవస్థ, అవిద్య, వేశ్యాలంపటత్వం భారతీయ మహిళల జీవితాలను అంధకారమయం చేసింది. తెలుగునాట సామాజిక సంస్కరణోద్యమం ద్వారా మహిళాభ్యుదయానికి 'సతీహితబోధిని'తో తొలిబాట వేసిన సంస్కర్త కందుకూరి వీరేశలింగం కాలంలో మహిళల నిర్వహణలో, మహిళల సంపాదకత్వంలో పత్రికలు వెలువడడం మహిళా చైతన్యానికి నాంది అయింది. 1904లో కాకినాడ నుంచి పులుగుర్త లక్ష్మీనరసమాంబ సంపాదకత్వంలో 'సావిత్రి' స్త్రీలకు పాతివ్రత్య ధర్మాలు ప్రచారం చేసింది. పునర్వివాహాలు, రజస్వలానంతర వివాహాలను వ్యతిరేకించింది. 1902 జూన్‌లో మాడభూషి చూడమ్మ, కళ్లేపల్లి వెంకట బుర్రా బుచ్చి బంగారమ్మ, గుండు అచ్చమాంబ, మన్యం వెంకట సుబ్బమ్మ, ఉప్పల నరసమాంబ, ఆత్మూరి అన్నపూర్ణమ్మ, సత్తిరాజు శ్యామలాంబ, కొటికల పూడి సీతమ్మ సాధారణంగా పద్య ప్రక్రియలో శతాధిక సంఖ్యలో కవయిత్రులు కొందరు పాతివ్రత్య ధర్మాలను ప్రచారం చేస్తే మరికొందరు వితంతు వివాహాలను, రజస్వలానంతర వివాహాలను, స్త్రీ విద్య ఆవశ్యకతను చాటిచెప్పారు. కాళిదాసు శాకుంతలం ఆంధ్రీకరించిన పది మందిలో ఒకరైన మహిళా కవయిత్రిగా కాంచనపల్లి కనకాంబ గుర్తింపు పొందారు.


తెలుగులో, బ్రిటిష్ పాలనా కాలంలో, భారతీయ సమాజంలో ప్రవేశించిన సంస్కరణోద్యమాలు ప్రధానంగా మహిళాభ్యుదయానికి సంబంధించినవి. స్త్రీలే పురుష పత్రికాధిపత్య బాధ్యతను తప్పించి, తామే పత్రికలు నిర్వహించుకొనే ఉద్యమ ధోరణుల నాటి స్త్రీల పత్రికలు, క్రమేపీ ఆధునిక స్త్రీవాద భావజాలం అలంకరించడానికి మార్గం చూపించాయి. హిందూ సుందరి, సావిత్రి, వివేకవతి, గృహలక్ష్మి వంటి పత్రికలు భావజాలం ఏదైనా స్త్రీల ఆలోచనలకు, భావోద్విగ్నతకు, కార్యాచరణకు దారి తీసి తమంతట తాముగా, పురుషాధిక్యతను తోసిపుచ్చే తిరుగుబాటు తత్వాన్ని ప్రేరేపించాయి. భారతీయ మహిళ జీవితాలను శాసించి పాలించిన పాతివ్రత్య మత ధర్మాలు, భక్తి కవిత్వ సాహితీ ధోరణుల నుండి తెలుగు మహిళలు కూడా కొత్త ఆలోచనలు వివిధ సాహితీ ప్రక్రియలలో ప్రచురింప చేసారు. తాళ్ళపాక తిమ్మక్కతో ఆరంభమైన భక్తికవిత్వం, తరిగొండ వెంగమాంబతో ప్రవర్ధిల్లినా, క్రమేపీ స్వాతంత్ర్యానంతరం తెలుగు మహిళ నవల, కథ, కవితా వివిధ వినూత్న ప్రక్రియలతో స్వేచ్ఛగా రెక్కలు విప్పి సాహితీ ఆకాశంలో విహరించింది.


"స్త్రీకి శరీరం వుంది వ్యాయామం యివ్వాలి; మెదడు వుంది విజ్ఞానం, హృదయం వుంది అనుభవం యివ్వాలి" అని 1926లో గుడిపాటి వెంకటాచలం చెప్పేంతవరకు ప్రస్తుత రాడికల్, ఫెమినిస్టు ధోరణులు తెలుగునాట అంకురించలేదు.

నేడు స్త్రీ వాద సాహిత్యం, సమాజాన్ని నిలదీస్తోంది.

**- జయసూర్య**



పొట్ట కోసినా ఒక్క అక్షరమ్ముక్క రాదని మనల్ని అనేవారు...
ఇంతకీ వీరి పొట్టలో ఉన్నయా? చూద్దామా...?!
Zakir...


చూస్తే రోమాలు నిక్కబొడుచుకునే
యూట్యూబ్ వీడియో మళ్ళీ చూసారా..?!
Zakir...


ఎవరు చనిపోయినా మీరే దిగ్భ్రాంతి చెందుతున్నారు... తమకూ
'దిగ్భ్రాంతి' చెందే అవకాశం ఇమ్మని సీనియర్లు అడుగుతున్నారు..
పార్టీ ఆఫీసు
Zakir...

# ఈ వారం కా'ర్టూన్స్'

# ఫోటో ఫీచర్



ప్రపంచంలోనే అతిపెద్ద రాచప్రాసాదమిది. సుమారు నూటా ఎనభై ఎకరాల్లో విస్తరించి వున్న ఈ రాచప్రాసాదంలో తొమ్మిది వందల ఎనభై భవంతులున్నాయి. చైనా రాజధాని బీజింగ్‌లో వున్న ఈ ప్రాసాదాన్ని 'ఇంపీరియల్ ప్యాలెస్' అని పిలుస్తారు. ప్రపంచ వారసత్వ నిర్మాణంగా గుర్తింపు పొందింది.







